
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY

నల్లగొండ
5
మంగళవారం 21 జనవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 , కనిష్ఠం 16.0



కొత్త పాస్‌పుస్తకాలకు సైతం రైతు భరోసా

ఏఈవోలకు దరఖాస్తు చేసుకునే అవకాశం

నల్లగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పట్టదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సైతం రైతు భరోసా ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొద్ది రోజులుగా కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా వస్తుందా? లేదా? ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కొత్త పాస్‌పుస్తకాలకు సైతం భరోసా చెల్లిస్తామని ప్రకటించింది. మంగళవారం నుంచి కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఏఈవోలకు దరఖాస్తులు చేసుకోవాలని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి వరకు కొత్త పాస్‌పుస్తకాలు పొందిన వారంతా వారి బ్యాంక్ ఖాతా నెంబర్‌తో పాటు పాస్ పుస్తకాల నెంబర్లను అధికారులకు అందజేయాలని, దీంతో ఈనెల 26 నుంచి వారికి సైతం రైతుభరోసా అందుతుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగో విడత రుణమాఫీ జమ

నాలుగో విడత రుణమాఫీకి సంబంధించిన నగదు అర్హులైన రైతుల ఖాతాల్లో జమ అవుతోందని నల్లగొండ జేడీఏ శ్రవణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి సంబంధించి జిల్లాకు రూ.236.90కోట్లు జమ చేసిందన్నారు. మొదటి విడతగా 99,839మంది రైతులకు రూ.579.14కోట్లు, రెండో విడతగా 54,551మంది రైతులకు రూ.632.92కోట్లు, మూడో విడతలో 33,804మంది రైతులకు రూ.55.92కోట్లు రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. నాలుగో విడత రుణమాఫీ నగదు రూ.236.90కోట్లను 21,432 మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నదని, ఈ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రైతు సమస్యలపై బీఆర్ఎస్ నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు అనుమతి నిరాకరించడంతో రెండు పార్టీల మధ్య మాటల మంటలు చెలరేగాయి. ప్రతిపక్షాలు అధమస్థాయికి దిగజారి వ్యవహరిస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు చేయగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయలేక బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలను అడ్డుకుంటోందని మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నుంచి గ్రామసభలకు ప్రభుత్వం సిద్ధమైన సందర్భంలో ఉమ్మడి జిల్లాలో అధికార, ప్రతిపక్షాల నడుమ ఢీ అంటే ఢీ అనే పరిస్థితి ఏర్పడడంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు (ఫైల్)

నీలగిరిలో వేడెక్కిన రాజకీయం

- బీఆర్ఎస్ మహాధర్నా మరో సారి వాయిదా
- ధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణ
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అడ్డుకుంటున్నారని అధికార పక్షంపై బీఆర్ఎస్ ఆరోపణలు
- ప్రతిపక్షాలు అధమ స్థాయికి దిగజారాయని వ్యాఖ్యానించిన మంత్రి కోమటిరెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షాలు

రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాల వారీగా రైతు మహాధర్నాలకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యే ఈ ధర్నాలను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా మహాధర్నాను నల్లగొండలో తొలుత ఈనెల 12న నిర్వహించాలని అనుకున్నా సంక్రాంతి పండుగ కారణంగా వాయిదా వేశారు. దీన్ని ఈనెల 21న నిర్వహించాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించే ఈ ధర్నాకు పోలీసుల అనుమతి కోరారు. అయితే ప్రభుత్వం ఈ నెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించాల్సి ఉండడం, 26న గణతంత్ర దినోత్సవం ఉండడం, ధర్నా చేపట్టే ప్రాంతం జాతీయరహదారిపై ఉండడంతో సరైన భద్రత కల్పించలేమని, ఈ నేపథ్యంలో మహాధర్నాకు అనుమతి ఇవ్వలేమని పోలీసులు పేర్కొన్నారు. దీంతో సోమవారం హైకోర్టు నుంచి అనుమతి కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించినా, కోర్టు సైతం ఈ పిటిషన్‌పై విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది.

దీంతో బీఆర్ఎస్ సైతం మహాధర్నాను వాయిదా వేసింది. మహాధర్నాను వాయిదా వేశామే తప్ప, విరమించడం లేదని, హైకోర్టు నుంచి ఆదేశాలు వచ్చాక ధర్నా నిర్వహించి తీరుతామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు మంగళవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది.

స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగానే

ఫిబ్రవరి రెండోవారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందనే సంకేతాల నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలో అధికార....

- మిగతా 6వ పేజీలో...



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నేటి నుంచి గ్రామసభల సందడి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో అనర్హులు

మునిసిపాలిటీల్లో కూలీలకు వర్తించని పథకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈ నెల 26 నుంచి అమలు చేయనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా అధికారులు అర్హుల ఎంపికకు సర్వే నిర్వహిస్తున్నారు. గుర్తించిన అర్హుల జాబితాను ఆమోదించేందుకు గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి గ్రామసభల సందడి నెలకొననుంది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించిన సర్వే ముగిసింది. సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో దీనిపైనా పెద్దగా పేచీ లేదు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి లబ్ధిదారుల ఎంపికకు జరుగుతున్న సర్వేపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేసినా గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి ప్రభుత్వానికి జాబితాలు వెళ్లేవి. అందుకు భిన్నంగా ఇప్పుడు జాబితాలను ప్రభుత్వమే రూపొందించి పరిశీలనకు అధికారులకు పంపుతోంది. ఇదేం తిరకాసని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మీయ భరోసాలో అనర్హులకు చోటు

భూమి లేని వ్యవసాయ కూలీలకు విడతకు రూ.6వేల చొప్పున రెండు విడతలుగా ఏడాదికి రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింది ప్రభుత్వం ఆర్థిక...

- మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ పథకాలు నిరంతరాయంగా కొనసాగుతాయి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతరం కొనసాగుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హుల జాబితాలో పేర్లు లేకుంటే ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. గ్రామ సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. గ్రామసభల సమాచారాన్ని టాంటాం ద్వారా ప్రజలకు ముందుగానే తెలియజేయాలన్నారు. పథకాల కింద అర్హులైన జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

గ్రామసభల నిర్వహణ బాధ్యత ఏపీవోలదని, తీర్మానాలన్నింటినీ భద్రపరిచే బాధ్యత, డేటా ఎంట్రీ ఎంపీడీవోదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు నమోదు చేసుకొని గ్రామసభ తీర్మానం మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు వివరాలను ఎంపీడీవో లాగిన్ ద్వారా జిల్లా స్థాయికి, తద్వారా రాష్ట్ర స్థాయికి పంపించాలన్నారు. కార్డుల్లో కొత్తగా పేర్లను జోడించేందుకు తహసీల్దార్ లాగిన్ ద్వారా డీఎస్‌వోకు, అక్కడి నుంచి కలెక్టర్ ద్వారా రాష్ట్రస్థాయికి పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో పేర్ల జోడింపునకు సుమారు 77వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై వచ్చిన అభ్యంతరాలను 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి' దరఖాస్తులన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌పై సన్నబియ్యం

వారం రోజుల్లో రైతు భరోసా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తిప్పర్తి మండల కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన అర్హులందరికీ రేషన్‌కార్డుపై సన్నరకం బియ్యాన్ని పంపిణీ చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పజ్జూరు గ్రామంలో జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గోదాంను, నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో కనీసం 4వేల రేషన్ కార్డులు కూడా పంపిణీ చేయలేదన్నారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు 40లక్షల రేషన్ కార్డులు పేదలకు అందజేస్తామన్నారు. కనీసం 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేదలందరికీ ఆరు నెలలకు ఒకసారి రూ.6వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమచేస్తామన్నారు. మండలంలో మామిడాల, పజ్జూరు గ్రామాల రోడ్లను డబుల్‌లేన్లుగా విస్తరిస్తున్నామన్నారు. మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ సభల్లో సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి పనులను త్వరతగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, కిసాన్ క్రెడిట్ కార్డులపై రైతులకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా బ్యాంకు నిర్వాహకులు చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యుడు పాశం రాంరెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి లింగారావు, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

(ఆంధ్రజ్యోతి, కనగల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం సాగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తిమ్మన్నగూడెం మీదుగా కనగల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులకు తిమ్మన్నగూడెం మంత్రి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలిందన్నారు. సుమారు రూ.7లక్షల కోట్ల అప్పులు కాగా, రూ.2వేల కోట్లను ప్రభుత్వం వడ్డీ రూపంలో చెల్లిస్తోందన్నారు. నిధుల కొరత ఉన్నా, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారన్నారు. జిల్లాకు సాగు తాగు నీటికి శాశ్వత పరిష్కారమైన ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను రెండేళ్లలో పూర్తి చేయిస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని కేటీఆర్ ఇప్పుడు దొంగ దీక్షలకు దిగుతాననడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు కనగల్ హైస్కూల్‌ను మంత్రి సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రూ.10లక్షల నిధులతో మినరల్‌వాటర్ ప్లాంట్, టాయిలెట్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాత్రి వేళ్లలో కొందరు పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగలగొట్టి వెళ్తున్నారని విద్యార్థులు ఆయన దృష్టికి తేగా, వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కనగల్‌లో జంక్షన్ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ డీఈ గణేష్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, జడ్పీ మాజీ సభ్యుడు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, భారతవెంకటేశం, దేపకరుణాకర్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, గోలి జగాల్‌రెడ్డి, భిక్షంయాదవ్, హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

ఎమ్మెల్యే బీఎల్‌ఆర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలపై మంగళవారం నుంచి జరిగే గ్రామ సభల్లో దరఖాస్తుదారుల పేర్లను చదివి ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలను గుర్తించి పథకాలు అందేట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, మునిసిపల్ కమిషనర్ ఎండీ యూసూఫ్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

మార్చిలో వస్తానన్నాడు

ఇంతలోనే ఘోరం

- అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య
- దుండగుల కాల్పుల్లో అక్కడికక్కడే మృతి
- ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా ఘటన

● వివరాలు ప్రధాన సంచికలో..

రాధేయ సాహిత్య కృషి అజరామరం

ఆచార్య మసన చెన్నప్ప



రాధేయ పురస్కారాన్ని అందుకుంటున్న సాహితీవేత్త మల్లిఖార్జున్

నల్లగొండ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో మాతృకవి రాధేయ విశిష్టమైన సేవలు అందించారని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. సోమవారం రాచమల్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ మాతృకవి రాధేయస్మారక పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. అమ్మను, అంబేడ్కర్‌ను, అన్నను అత్యున్నతంగా ఆరాధించిన వాడు రాధేయ అని అన్నారు. అనంతరం నల్లగొండకు చెందిన సాహితీవేత్త డాక్టర్ చింతోజ మల్లిఖార్జున్‌కు మాతృకవి రాధేయ పురస్కారం, మాతృమూర్తి లచ్చమ్మ పురస్కారాన్ని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య సూర్య ధనుంజయకు అందజేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు రాచమల్ల శ్యాంసుందర్, వెంకటరాజయ్య, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, వెంకటేశ్వర్లు, ఆంజయ్య, అనిత, ఐలయ్య, శ్రీవాణి, డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అభివృద్ధి చేశాం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీ అనే వివక్ష లేకుండా అన్ని వార్డులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని మునిసిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలందరూ ఎదురుచూస్తున్న మాస్టర్ ప్లాన్ అతిత్వరలో రానున్నట్లు తెలిపారు. కొంతమంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి డబ్బా దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయిలకు ఇస్తూ దందా చేస్తున్నారని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలని, అందుకు కౌన్సిల్ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. 2012-13 సంవత్సరానికి సంబంధించి స్టాంప్ డ్యూటీ మునిసిపాలిటీకి రూ.24కోట్లు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఇంకా రూ.12కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం కౌన్సిల్‌కు సంబంధం లేకుండా పనులు చేపట్టడం, కౌన్సిలర్లను అవమానపరిచేలా చేశారని విమర్శించారు. కానీ, ఈ 11 నెలల కాలంలో కౌన్సిల్ సభ్యులకు గౌరవిస్తూ ప్రతీ వార్డుకు సమాన నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం అభినందనీయమని కొనియాడారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తీరని రైతుల సాగునీటి 'కల'

- చెరువుకు చేరని ఉదయసముద్రం 'జల'
- చౌడంపల్లి చెరువుకు అడ్డొచ్చిన 'శిల'
- నీరు లేక ఊర చెర్వు వెలవెల

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి బ్రాహ్మణవెల్లెంల లోని ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతికి అంకితం చేశారు. రిజర్వాయర్‌లోకి కృష్ణమ్మ చేరి కనువిందుచేస్తోంది. ఇక సాగునీటి బాధలు తప్పినట్లేనని భావిస్తున్న సమీప చౌడంపల్లి గ్రామ రైతుల్లో గుండెల్లో పిడుగులాంటి సమాచారం పడింది. ఊరికి తలాపునే ఉన్న రిజర్వాయర్ నీళ్లు తమ బోర్లకు చేరవన్న విషయం తెలిసి షాకవుతున్నారు. గ్రామ శివారు భూమి పొరల్లో ఉన్న ఓ 'శిల' వాళ్ల సాగునీటి 'కల'ను చెరిపేస్తోంది. ఓ వైపు కృష్ణానీటితో బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ 'జలకళ'తో పరిసర గ్రామాల చెర్వులు నిండుగా కనిపిస్తుండగా చౌడంపల్లి గ్రామ ఊర చెర్వు మాత్రం చుక్క నీరు లేక 'వెలవెల'బోతుండటం రైతుల్లో నిరాశను కలిగిస్తోంది.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

బీ.వెల్లెంల ప్రాజెక్టును గతేడాది డిసెంబరు 7న ప్రాజెక్టు జాతికి అంకితం చేశారు. సుమారు 0.3 టీఎంసీ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు రిజర్వాయర్‌ను సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ముందు రెండు మోటార్లతో 0.2 టీఎంసీల మేర నీటితో నింపారు. మోటార్ల నుంచి సిస్టర్న్ వద్ద రిజర్వాయర్‌లోకి ఎగిసిపడిన నీటిని చూసి సమీప గ్రామాల రైతులు ఆనందపడ్డారు. అయితే సమీపంలోని చౌడంపల్లి రైతుల బోర్ల లోకి మాత్రం సరిపోను నీరు రాలేదు. ఇంతకు ముందు భూగర్భజలాలు అడుగంటడం చేత బావులు, చెరువులు ఎండాయి. అయితే రిజర్వాయ్‌లోకి నీళ్లు చేరాక కొత్తగూడెం, అపురవాణి, నేరడ, అప్పాజిపేట తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. కానీ సమీపంలోని రిజర్వాయర్ ఉన్న తమ బోర్లలోకి నీరెందుకు చేరడం లేదన్న ప్రశ్న చౌడంపల్లి రైతుల్లో మొదలైంది.



జియాలజిస్టు గుర్తించిన డోలమైట్ శిల ఉన్న ప్రదేశాలు(మందంగా ఉన్న ఎరుపురంగు గీతల్లో)

సమస్యకు పరిష్కారమిది

చౌడంపల్లి రైతుల సమస్య తీరాలంటే రిజర్వాయర్ కుడి కాల్వ డిస్ట్రిబ్యూటరీ పాయింట్-1 నుంచి నీటిని చౌడంపల్లి చెరువుకు తరలించడమే పరిష్కారంగా పలువురు సూచిస్తున్నారు. ప్రస్తుతం కాల్వ పనులు పూర్తికాలేదు కనుక ఆర్ఎంసీలోకి ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేయడం లేదు. ఈ కారణంగా డీపీ-1 నుంచి ఇప్పటికిప్పుడే నీటిని చౌడంపల్లి చెరువుకు చేరవేయడం కష్టంగా అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే రిజర్వాయర్ కట్ట వద్ద వృథాగా పోతున్న సీపేజీ నీటిని చౌడంపల్లి ఊర చెర్వుకు మళ్లించే చర్యలు చేపడితే చెర్వు ఆయకట్టు పరిధిలోని బోర్లలోకి భూగర్భజలాలు చేరుతాయనే అభిప్రాయం రైతుల నుంచే వినపడుతోంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ మాజీ ఉపసర్పంచ్ దామెర ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే కలెక్టర్ ఇలా త్రిపాఠికి విన్నవించారు. అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లాలని గ్రామస్థులు యోచిస్తున్నారు.

జియాలజిస్టు పరిశీలనతో వెలుగులోకి

చౌడంపల్లి గ్రామానికి చెందిన దామర చంద్రయ్యకు ఐదు ఎకరాల భూమి ఉండగా అందులో వ్యవసాయ బోరు కూడా ఉంది. ఆ బోరులోకి నీరు రాలేదు. చంద్రయ్య కుమారుడు కేంద్ర భూగర్భ జల శాఖ విభాగంలో కర్ణాటక రాష్ట్రంలో హైడ్రో జియాలజిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడు. సెలవుపై స్వగ్రామం చౌడంపల్లికి వచ్చిన అతడికి తండ్రి చంద్రయ్యతో పాటు బాధిత రైతులు బోర్లలోకి నీళ్ల రాని విషయాన్ని తీసుకెళ్లారు. జియాలజిస్టు కావడంతో తనకున్న సర్వీసు అనుభవంతో శాస్త్రీయంగా టోపో షీట్ ప్రాస్పెక్టస్ మ్యాప్ ద్వారా పరిశీలించాడు. బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు అతి సమీపంలోని దాదాపు 300 మీటర్ల దూరంలోనే భూగర్భంలో అతి పెద్ద 'డోలరైట్ డైక్' (ఏనలాంటి) శిల ఉన్నట్లు నిర్ధారించాడు. భారీ పరిమాణంలో ఉన్న ఈ శిలే చౌడంపల్లి చెర్వులోకి బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి భూగర్భజలం వెళ్లకుండా ఆనకట్టలా అడ్డుకుంటుందని గుర్తించాడు. అయితే కేవలం చౌడంపల్లి చెర్వులోకి మాత్రమే భూగర్భం ద్వారా నీరు వెళ్లకుండా ఈశాన్య నుంచి నైరుతి దిశలో ఉన్నట్లు గుర్తించాడు.


ఎండిన చౌడంపల్లి చెర్వు

క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరిస్తాం

బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి చౌడంపల్లి చెర్వుకు నీరు చేరకుండా భూగర్భంలో భారీసైజు ఓ ఏనరాయ అడ్డొస్తుందని గ్రామస్థుల ద్వారా తెలిసింది. ఐతే వాస్తవమేంటో క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రయత్నిస్తాం. ప్రస్తుతానికి సీపేజ్ వాటర్‌ను చెర్వులోకి మళ్లించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను, వనరులను పరిశీలించి రైతులకు తగు న్యాయం చేస్తాం.


గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ,

గతంలో వరద నీరు వచ్చేది


రిజర్వాయర్ కాల్వ రాక ముందు దేశిరెడ్డి, ఆలూరోళ్ల వాగుల మీదుగా వరద నీరు చెర్వుకు చేరేది. దీంతో నాతో పాటు మా బంధువులది కలిపి 12ఎకరాలకు గాను మా పొలాల్లోని వ్యవసాయ బోర్లలో నీళ్లుండేవి. కుడి కాల్వ నిర్మాణం తర్వాత వరదనీరు రావడం లేదు. రెండేళ్ల నుంచి వానలు సమృద్ధిగా పడటంతో సాగునీటికి ఇబ్బందిలేదు. కానీ ఇపుడు నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. రిజర్వాయర్ నీళ్లు మా బోర్లకు అందడం లేదు. కాల్వ తూమును తెరిచి సాగునీరు అందేలా చేయండి.

చెరుకుపల్లి ఎల్లమ్మ, మహిళా రైతు, చౌడంపల్లి

వరి నారుమడితోనే వదిలేశా


చెర్వులో నీటి చుక్క లేదు. మునుపటి సీజన్‌లో కురిసిన వానలతో బోర్లు నీటిని పోయగా నాకున్న ఐదు ఎకరాల్లో వరి సాగు చేశా. కానీ రిజర్వాయర్‌లోకి నీళ్ల వచ్చినా నా పొలం బోరుకు సమృద్ధిగా నీరందలేదు. దీంతో వరి సాగును ఈ పర్యాయం కేవలం నారుమడితోనే వదిలేశా. వేసిన వరినారును కూడా వేరే రైతులకు ఇస్తా.

నర్ర వెంకట్‌రెడ్డి రైతు, చౌడంపల్లి

విహార కేంద్రంగా భువనగిరి ఖిల్లా

- విజ్ఞానయాత్రల పేరిట పెరిగిన విద్యార్థుల సందర్శన


భువనగిరి ఖిల్లాపై గ్రూఫ్ ఫొటో దిగుతున్న హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి - భువనగిరి టౌన్)

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్రకు కేరాఫ్‌గా మారుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఖిల్లాకు సందర్శించేందుకు వస్తున్న విద్యార్థుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అత్యంత ఎత్తయిన ఏకశిలా పర్వతంగా ఉండటం, అద్భుత శిలాకళా నైపుణ్యంతో నిర్మించిన కోట గోడ, ఇతర కట్టడాలు, పలు రాజవంశాల పాలనకు కేంద్రంగా ఉన్న ఖిల్లాను సందర్శిస్తే చారిత్రక విషయాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభిస్తోందన్న ఉద్దేశ్యంతో పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు ఖిల్లా సందర్శనను ఎంపిక చేసుకుంటున్నారు. అంతేకాక రాక్ క్లైంబింగ్ స్కూల్ పర్యవేక్షణలో సాహస క్రీడలైన రాక్ క్లైంబింగ్, రాప్లింగ్, జిప్‌లైన్ గేం ఆడే అవకాశాలు ఉండటంతో హైదరాబాద్‌కు చెందిన పలు ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ విద్యార్థులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. దూర ప్రాంతాలనుంచి వస్తున్న విద్యార్థులు భువనగిరి ఖిల్లా, యాదగిరిగుట్ట, కొలనుపాక, హైదరాబాద్ ప్యాకేజీతో వస్తున్నారు. మరికొన్ని పాఠశాలలు తమ విద్యార్థులను భువనగిరి ఖిల్లాతో పాటు వరంగల్ జిల్లా పర్యటనకు తీసుకువెళ్తున్నారు. రెండు నెలలుగా సుమారు 12 పాఠశాలలకు చెందిన సుమారు రెండు వేల మందికి పైగా విద్యార్థులు ఖిల్లాను సందర్శించారు. గైడ్ వినోద్ తదితరులు ఖిల్లా విశేషాలను వారికి వివరిస్తున్నారు. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా రూ.100కోట్లతో చేపడుతున్న పనులు పూర్తయితే సందర్శకుల సంఖ్య మరింత పెరగవచ్చని పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు భావిస్తున్నారు.


రాక్ క్లైంబింగ్ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు విజ్ఞానం పంచేలా ఖిల్లా సందర్శన

భువనగిరి ఖిల్లా సందర్శన విద్యార్థులకు విజ్ఞానం పంచేలా ఉంది. చారిత్రక నిజాలను తెలుసుకునేందుకు విజ్ఞాన యాత్రల పేరిట విద్యార్థులను భువనగిరి ఖిల్లాకు తీసుకురావాలి. చారిత్రక కట్టడాలను ప్రత్యక్షంగా సమీపంనుంచి చూసే అవకాశం ఉంది. ఖిల్లా సందర్శన మా విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపింది. సాహస క్రీడలు అందుబాటులో ఉండటం అదనపు ఆకర్షణ. మా పరిసర పాఠశాలల విద్యార్థులు కూడా ఖిల్లాను సందర్శించేలా ప్రోత్సహిస్తాం.

నర్సింహులు, ఉపాధ్యాయుడు, వికారాబాద్

ఇంద్రధనస్సులు కవితకు అరుదైన గౌరవం

25న అన్ని భాషల్లో ఆల్‌ఇండియా రేడియోలో ప్రసారం


రచయిత ఏనుగు నర్సింహారెడ్డి

చిట్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన కవి, రచయిత, అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి రాసిన కవిత ఇంద్రధనస్సులు అరుదైన గౌరవాన్ని పొందింది. అన్ని భారతీయ భాషలోకి అనువదించిన కవిత ఈ నెల 25న ఆకాశవాణి అన్నికేంద్రాల నుంచి ప్రసారం కానుంది. స్త్రీల వ్యక్తిత్వం, త్యాగనిరతిపై రాసిన ఈ కవితను గత ఏడాది డిసెంబరు 20న ముంబైలో నిర్వహించిన సర్వ భాష కవి సమ్మేళనంలో ఏనుగు నర్సింహారెడ్డి స్వయంగా చదివి వినిపించారు. ఈ కవితను ఢిల్లీకి చెందిన అలోక్‌పాండ్యా హిందీ అనువాదం వినిపించారు. హైదరాబాద్ ఆకాశవాణిలో ఈ నెల 17న ఇంద్రధనస్సులుతో పాటు వివిధ భాషలలో రాసిన కవితలను తెలుగులో అనువాదం చేసి సర్వభాష కవి సమ్మేళనం నిర్వహించి రికార్డు చేశారు. ఇలా అనువాదం చేసిన అన్ని కవితలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి ప్రసారం కానున్నాయి.

జాతీయ గణిత ఒలంపియాడ్ శిక్షణ శిబిరానికి

నల్లగొండ జిల్లా ఉపాధ్యాయుడు


జాతీయ ఒలంపియాడ్ శిబిరానికి హాజరైన ఆర్ఎల్ఎన్ మూర్తి

మర్రిగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గణిత ఒలంపియాడ్ కార్యక్రమాల శిక్షణ శిబిరానికి నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు హాజరయ్యారు. గుజరాత్ రాష్ట్రంలోని ఐఐటీ గాంధీనగర్‌లో జాతీయ గణిత ఒలంపియాడ్ కార్యశాల శిక్షణ శిబిరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి మర్రిగూడ మండలం ఎరగండ్లపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఆర్ఎల్ఎన్ మూర్తి హాజరయ్యారు. ఈ శిక్షణకు గతేడాది నవంబరులో దరఖాస్తు చేసుకోగా డిసెంబరు 31న ఆహ్వానం అందింది. ఈ నెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణా శిబిరానికి ఆయన హాజరయ్యారు.ఈ శిబిరానికి 60 రాష్ట్రాలకు చెందిన గణిత ఉపాధ్యాయులు హాజరయ్యారు. జాతీయస్థాయి గణిత ఒలంపియాడ్‌కు ఆర్ఎల్ఎన్ మూర్తి హాజరవడంపై డీఈవో భిక్షపతి, ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాలతి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో తార్కిక ఆలోచన పెంచాల్సి ఉంది

ఐఐటీ గాంధీనగర్ గణిత శాఖ అధిపతి, కోఆర్డినేటర్ ఇంద్రాసేన్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యశాలకు హాజరయ్యారు. శిక్షణ సందర్భంగా విద్యార్థులకు గణిత ఒలంపియాడ్‌పై సరైన అవగాహన కల్పించాల్సి ఉందని, అదేవిధంగా విద్యార్థుల్లో తార్కి ఆలోచన పెంచాలని సూచించారు.

ఆర్ఎల్ఎన్ మూర్తి, గణిత ఉపాధ్యాయుడు

23 నుంచి దూపహాడ్‌లో ఉర్సు ఉత్సవాలు



పెన్‌పహాడ్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్ గ్రామంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మహిబూబా దర్గా ఉర్సు కొనసాగనుంది. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉత్సవాలు జరిగే సమయంలోనే ఇక్కడా నిర్వహించడం ఆనవాయితీ. 23న దీపారాధన, చాందిని అలంకరణ, 24న జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధం రాక, అదే రోజు భక్తులు ప్రభ బండ్లతో మొక్కులను తీర్చుకోనున్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా సోమవారం మండల స్థాయి మహిళా కోలాటా పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆర్తి కేశవులు ప్రారంభించారు. గోపగాని హుస్సేన్, గోపగాని గురువయ్య, గోపగాని సైదులు, గోపగాని లక్ష్మీనారాయణ, గోపగాని సందీప్ పాల్గొన్నారు.

గుర్తుండేలా ఉత్సవాలు



- క్షేత్రప్రాశస్త్యం మరింత విస్తరించేలా!
- వచ్చే ఏడాది వరకూ గుర్తుండేలా
- బ్రహ్మోత్సవాల నిర్వహణకు సన్నాహాలు

(ఆంధ్రజ్యోతి-భువనగిరి అర్బన్)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఏటా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలపై ఈ సారి అధికారులు ముందుగానే ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్ర ప్రాశస్త్యం మరింత విస్తరించేలా ఆలయ విశిష్టతను నలుదిక్కులా వ్యాప్తి చేసేందుకు కొత్తదనంతో ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా కనివినీ ఎరగని రీతిలో నిర్వహించేందుకు అధికారులు సంకల్పించారు. స్వామి సన్నిధిలో 11 రోజుల పాటు నిర్విరామంగా జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ ఏడాది ఉత్సవాలు వచ్చే వార్షిక బ్రహోత్సవాలకు వరకూ గుర్తుండేలా నిర్వహించాలని సన్నాహాలు మొదలుపెట్టారు.



ఆధ్యాత్మిక ప్రవచనాలు

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల వైభవం, ఆలయ ప్రాశస్త్యం నలుదిక్కులా మరింత వ్యాప్తి చెందేలా సంగీత, సాహిత్య, ధార్మిక సభలు నిర్వహించాలని కసరత్తు మొదలుపెట్టారు. గతేడాది నవంబరు 12న ఈవో భాస్కర్‌రావు ప్రధానార్చకుడు కాందూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకుడు బీ సురేంద్రచార్యులుతో కలిసి ఆధ్యాత్మిక గురువు గరికపాటి నర్సింహారావును బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రవచనాలు చెప్పేందుకు ఆహ్వానించారు. ఈ ఏడు వార్షిక బ్రహ్మోత్సవాల ప్రాశస్త్యం పెంచేలా సంగీత రంగంలో ప్రసిద్ధి చెందిన ప్రముఖులతో కొత్త వైభవం సంతరించేందుకు అధికారులు చొరవ తీసుకుంటున్నారు. ఆలయ చరిత్రలో నిలిచిపోయేలా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఈవో ఇదివరకే ప్రకటించారు.



అనుబంధ ఆలయాల్లోనూ

పాతగుట్ట ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి నుంచి 13వ తేదీ వరకు వారం రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. వీటి కంటే ముందు ఏటా నిర్వహించే వార్షిక అధ్యయనోత్సవాలు (ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు) ముందుగా నిర్వహిస్తారు. ఆ మరుసటి రోజు నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇదిలా ఉండగా ప్రధాన ఆలయంలో ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినం నుంచి ఐదు రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఈ నెల 10 నుంచి 15 వరకు అధ్యయనోత్సవాలను నిర్వహించారు.

శివాలయంలోనూ

కొండపైన శివాలయంలోని పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి వార్షిక బ్రహోత్సవాలు కూడా ఫిబ్రవరి 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. ఆరు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలు శైవాగమ రీతిలో చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

10 రోజులు ముందుకే...

ఆలయ చరిత్రలోనే విమాన రాజగోపురం బంగారు తొడుగులతో ఈ ఏడాది నుంచి కొత్తగా ఆవిష్కృతం కానుంది. ఇందుకోసం గాలి గోపురానికి బంగారు తాపడం పనులు కూడా పూర్తి చేసేందుకు ఈవో భాస్కర్‌రావు అవిశ్రాతంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే రాత్రివేళ బంగారు వర్ణంలో ఆలయం మెరిసిపోతుండగా బంగారుతాపడం(తొడుగులు) పనులు త్వరగా పూర్తి చేసేందుకు ముందుకు సాగుతున్నారు. దివ్యవిమాన (గాలి)గోపురానికి సంబంధించి 49.5పీట్ల ఎత్తు, సుమారు 10,857 చదరపు అడుగుల మేర బంగారు తాపడం పనులు సాగుతున్నాయి. ఒక చదరపు అడుగు 6గ్రాముల బంగారం అంచనాలతో దాదాపు 66కిలోల మేర బంగారం వినియోగిస్తున్నారు. కాగా, ఇప్పటి వరకు 75శాతం బంగారు తొడుగులు ఆలయానికి చేరుకున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు మిగతా 25శాతం తొడుగులు చేరుకోనున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. బ్రహ్మోత్సవాల గడువు సమీపిస్తోన్న తరుణంలో తొడుగుల పనుల్లో వేగం పెంచారు. ముందుగా ఫిబ్రవరి 20వ తేదీ వరకు లక్ష్యంగా పెట్టుకోగా, ప్రస్తుత ఫిబ్రవరి 10 వరకే తొడుగుల బిగింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు సుమారు 25మంది కూలీలతో పనులు శరవేగంగా కొనసాగిస్తున్నారు.

ఆలయ ప్రాశస్త్యం పెంచేందుకు కృషి చేస్తా


ఆలయ ప్రాశస్త్యం మరింత పెంచేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాం. వచ్చే బ్రహ్మోత్సవాల వరకు గుర్తుండేలా వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఈ పర్యాయం దివ్య విమాన రాజగోపురం బంగారు తాపడంతో సువర్ణవర్ణంలో మెరవనుంది. స్వామివారి ఆశీస్సులతో కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న బంగారు తొడుగుల కల నేరవేర్చే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నా.

ఏ.భాస్కర్‌రావు, ఈవో, యాదగిరిగుట్ట దేవస్థానం

నీలగిరిలో వేడెక్కిన రాజకీయం

(5వ పేజీ తరువాయి)

ప్రతిపక్షాలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. ప్రధానంగా అసెంబ్లీ ఎన్నికల హామీల్లో కీలకమైన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీకి అర్హులను ఎంపికచేసేందుకు మంగళవారం నుంచి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించనుంది. ఈ సభలను ఈ నెల 24వరకు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపికచేస్తారు. అదేవిధంగా ఈ పథకాలకింద అర్హులైన వారి నుంచి కొత్తగా దరఖాస్తులు సైతం తీసుకుంటారు. ప్రధానంగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రజల అంచనాలు భారీగా ఉన్నాయి. అదే సమయంలో రేషన్‌కార్డుల ఎంపిక కోసం తయారుచేసిన అర్హుల జాబితా తక్కువ సంఖ్యలో ఉండడంతో వారిలో అసంతృప్తిని గమనించిన ప్రభుత్వం దాన్ని సరిచేస్తూ అర్హులందరి నుంచి కొత్తగా రేషన్‌కార్డులకే కాకుండా, ఇందిరమ్మ ఇళ్లకూ గ్రామసభల్లో దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు తరుముకొస్తుండడంతో అధికార పార్టీ వ్యూహాత్మకంగా కీలకమైన ఈ హామీల అమలుకు తెరలేపి, రానున్న ఎన్నికల్లో విజయానికి సాధనంగా వినియోగించుకోవాలనే యత్నిస్తోంది. రైతుభరోసా పథకం కింద రూ.15వేలకు బదులు రూ.12వేలకు తగ్గించారని, సాగులో లేని భూముల సర్వే పేరుతో అర్హుల జాబితాను కుదించారని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు, కొత్త రేషన్‌కార్డుల జారీలో, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రామసభల వేదికగానే ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలనే వ్యూహాన్ని ప్రతిపక్షాలు అనుసరిస్తుండడంతో గ్రామసభలు వాడివేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

మొత్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బలాన్ని చాటుకునేందుకు ఇటు అధికారపార్టీ, అటు ప్రతిపక్ష పార్టీలు వ్యూహాలతో సిద్ధమవుతుండడంతో రానున్న నాలుగు రోజులు జిల్లాలో వాడివేడి రాజకీయం కొనసాగే అవకాశం ఉంది.

కమీషన్ కోసం ఆశ.. రూ.30వేలు స్వాహా

నిడమనూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తనకు డబ్బులు అవసరం ఉన్నాయని, ఫోన్‌పే చేస్తానని నమ్మబలికి ఓ వ్యక్తి ఫేక్ ఫోన్‌పే చేసి రూ.30 వేలు టోకరా వేసి డబ్బులతో ఉడాయించాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో జరిగింది. బాధితుడు ఫిర్యాదుతో సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన రవి అనే యువకుడు మండలకేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న రవి బంకులో ఉండగా గుర్తుతెలియని ఓ వ్యక్తి వచ్చి తనకు డబ్బుల అవసరముందని, రూ.30 వేలు ఫోన్‌పే చేస్తానని నగదు ఇవ్వాలని బతామాలాడాడు. నగదు ఇస్తున్నందుకు రూ.వెయ్యి కమీషన్ తీసుకోవాలని కోరాడు. కమీషన్‌కు ఆశపడిన రవి సరే అనడంతో నిందితుడు ఫోన్‌పే చేసినట్లు ఫోన్ చూపించాడు. నమ్మి అతని చేతిలో రూ.29 వేలు పెట్టడంతో సదరు అపరిచితుడు వెంటనే అక్కడి నుంచి డబ్బులతో ఉడాయించాడు. కొద్దిసేపటి తర్వాత వర్కర్ తన సెల్‌ఫోన్ చెక్ చేసుకోవడంతో ఫోన్‌పే ద్వారా డబ్బులు రాలేదు. ఫేక్ ఫోన్‌పే చేసి తనను మోసం చేసి డబ్బులతో పరారైనట్లు గమనించాడు. బంక్‌లో ఉన్న సీసీపుటేజీ పరిశీలించారు. ఫేక్ ఫోన్‌పేతో మోసం చేసి డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యక్తి మిర్యాలగూడ మండలం లోక్యాతండాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. బాధితుడు రవి సోమవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విషపురుగు కాటుతో బాలిక మృతి



కావ్య(ఫైల్)

రాజాపేట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రేగుపండ్ల కోసం వెళ్లిన బాలిక విషపురుగు కాటుతో మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నేమిల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిప వివరాల ప్రకారం... మండలంలోని నెమిల గ్రామానికి చెందిన వేముల మహేందర్‌గౌడ్-శ్రీలత దంపతులకు ముగ్గురు సంతానం. మూడో కుమార్తె వేముల కావ్య(14) స్థానిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో తమ బావి వద్దకు రేగుపండ్ల కోసం వెళ్లింది. అక్కడ ఏదో కుచ్చుకున్నట్లు అనిపించగా అదే రోజు సాయంత్రం వాంతులు అయి అపస్మారక స్థితిలో వెళ్లింది. చికిత్స నిమిత్తం భువనగిరికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి హైదారాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. విషపు పురుగు కాటువేయడంతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చదువులో ముందుండే కూతురు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎస్.ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ధర్మారం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీస్ నిధులు రూ.12లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవననిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని అదే గ్రామానికి చెందిన మందుల శ్రీకాంత్ ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంతో ధ్వంసం చేశాడు. గ్రామానికి చెందిన కత్తుల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిల్వ చేసిన 10టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని టేకుల సోమారం గ్రామానికి చెందిన కుడితాల వెంకటేశ్వర్లు కిరాణ దుకాణం నిర్వహిస్తుంటాడు. ఆయన ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన నిల్వ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు అతని దుకాణాన్ని తనిఖీ చేశారు. 10టన్నుల రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సివిల్ సప్లయ్ అధికారి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిట్యాలరూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన జువ్వనపూడి విక్రమ్(26) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు విక్రమ్ స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో పండుగను జరుపుకుని ఉద్యోగానికి వెళ్లేందుకు స్వగ్రామం నుంచి ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున 2గంటల సమయంలో తన ద్విచక్రవాహనంపై తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మండలంలోని వెలిమినేడు శివారులోకి చేరుకోగానే రాంగ్‌రూట్‌లో వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో విక్రమ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న చిట్యాల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విక్రమ్ అవివాహితుడు. సోదరి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో చోరీ.. 14తులాల బంగారం అపహరణ

నల్లగొండ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీకాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీకాలనీకి చెందిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి మేకల వరప్రసాద్ తన కూతురు విదేశాలకు వెళ్తుండడంతో ఈ నెల 15వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆ రోజు తన బంధువుల వద్ద ఉన్నాడు. సోమవారం నల్లగొండలోని ఆర్టీసీ కాలనీలో ఉన్న వారి ఇంటికి రాగా తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులన్నీ చిందర వందరగా ఉన్నాయి. ఇంట్లో ఉన్న సుమారు 14 తులాల బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. వరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిరి వికాసం.. నిధులు లేక నీరసం

» గిరిజన రైతులకు భరోసా కల్పించని పథకం » మారుమూల ప్రాంతాల్లో సాగునీటి వసతికి దూరం » పథకం అమలుకు నిబంధనల అడ్డంకి



సీఎం గిరి వికాసం పథకం లబ్ధిదారులను నిరాశకు గురిచేస్తోంది. వ్యవసాయాన్నే ఆధారంగా చేసుకొని జీవిస్తున్న పేద గిరిజన రైతుల కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అనుకున్న ఫలితాలు ఇవ్వడం లేదు. సాగులో వెనుకబడిన గిరిజన రైతులను గుర్తించి వారికి ఆర్థికంగా భరోసా కల్పించడంతోపాటు బీడు భూములను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని గత ప్రభుత్వం తీసుకువచ్చింది. పథకం గురించి గిరిజన రైతులకు అవగాహన లేకపోవడం, నిబంధనలు, లబ్ధిదారుల ఎంపిక, నిధుల మంజూరులో జాప్యం పథకం లక్ష్యం నీరుగారుతోంది. ముఖ్యంగా నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా పనులు నిలిపివేయడంతో గిరిజన తండాలు, మారుమూల ప్రాంతాల్లో లబ్ధిదారులు సాగునీటి వసతి లేక పంటలకు దూరమవుతున్నారు.


– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)

గిరి వికాస పథకం అమలు బాధ్యత జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ సౌజన్యంతో అమలయ్యే ఈ పథకం ద్వారా గిరిజన భూములను సాగులోకి తీసుకురావడం, గిరిజన రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. నగదు బదిలీ ద్వారా కాకుండా ప్రత్యక్షంగా రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు అందిస్తుంది. గతంలో ఇందిర జలప్రభ పథకం ఉండేది. దాని స్థానంలో గిరి వికాసం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా నాలుగు రకాలుగా గిరిజన రైతులకు ప్రయోజనం చేకూరుస్తారు. పనికిరాని మొక్కలు, బండరాళ్లు మొదలైన వాటిని తొలగించడం ద్వారా బంజరు భూములను, సాగు భూములుగా మారుస్తారు. గిరిజన రైతుల పొలాలకు బోర్లు వేయించడం, బోర్లు తవ్విస్తారు. బోర్లు ఉన్న రైతులకు విద్యుత్ సదుపాయం కల్పిస్తారు. ఈ పథకాన్ని గత ప్రభుత్వం 2020-21లో అమల్లోకి తెచ్చింది. ఇద్దరి నుంచి ఆరుగురు వరకు గిరిజన రైతులను సభ్యులుగా చేరుస్తారు. వారి ఐదారు ఎకరాల వరకు ఉన్న పొలాలను బ్లాకుగా ఎంపిక చేశారు. వీటిలో భూగర్భ జలశాఖ ద్వారా సర్వే చేయించి నీటి లభ్యత ప్రామాణికంగా ఎంపిక చేసి ఉచితంగా సామూహిక బోర్లు వేయించి విద్యుత్ మోటార్లు అమర్చాలని నిర్ణయించారు. తద్వారా రైతులకు వంతుల వారీగా పంటలు సాగు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

నిధుల కొరతతో నిలిచిన పనులు

ఈ పథకం కింద 2021-22 సంవత్సరంలో రూ2.84కోట్లు మంజూరయ్యాయి. ఆ ఏడాది విద్యుదీకరణ పనులకు సంబంధించి మిర్యాలగూడ క్లస్టర్‌లో 115 పనులు, దేవరకొండ క్లస్టర్‌లో 53 పనులకు రూ18.90 కోట్లు ఖర్చు చేశారు. 2022-23 సంవత్సరంలో మ్యిలగూడ క్లస్టర్‌లో 8 పనులకు రూ. 18.90లక్షలు ఖర్చుచేశారు. 2022-23 సంవత్సరంలో మోటర్‌పంపు సెట్లకు మిర్యాలగూడ, దేవరకొండ, నల్లగొండ క్లస్టర్‌లో 81 పనులకు రూ.64.23 లక్షలు ఖర్చు చేశారు. 2023-24 సంవత్సరంలో మిర్యాలగూడ, దేవరకొండ క్లస్టర్‌లలో 8 పనులకు రూ.70.55లక్షలు ఖర్చుచేశారు. 2024-25లో రూ26.03లక్షలతో 56 బోర్‌వెల్ డ్రిల్లింగ్ చేశారు. మొత్తంగా ఐదేళ్లలో మొదటి సంవత్సరం వచ్చిన నిధులే ఖర్చు చేశారు తప్ప కొత్తగా నిధులు వచ్చిన దాఖలాలు లేవు. పథకానికి ధరఖాస్తు చేసుకొని నిధులు విడుదల కోసం ఔత్సాహిక గిరిజన రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి



ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులన్నింటినీ నిబంధనల మేరకు ఖర్చు చేశాం. ప్రస్తుతం నిధుల కొరతతో పనులు జరగడం లేదు. కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు విడుదలైన వెంటనే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గ్రౌండింగ్ చేస్తాం.


– శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, పీడీ, నల్లగొండ.

పథకంపై కొరవడిన ప్రచారం

ఈ పథకం గురించి గిరిజన రైతులకు అవగాహన కల్పించేలా పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి అర్హత పొందాలంటే గిరిజన రైతులు పట్టా కలిగి ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకంలో కొన్ని మార్పులు చేర్పులు చేసి గిరిజన వికాసం పేరుతో ప్రవేశపెట్టినా పెద్దగా ఫలితం లేకుండా పోతోంది. పథకం అమలులో లోపించిన చిత్తశుద్ధి, నిర్లక్ష్యం, నిధుల కొరత ఫలితంగా గిరిజనుల బీడు భూముల పరిస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకం గురించి గిరిజన రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని గిరిజన రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● సెలవులు ముగియడంతో పాఠశాలకు పంపిన తల్లిదండ్రులు ● కొద్దిసేపటి తర్వాత గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న విద్యార్థిని



సూర్యాపేటలోని గురుకుల పాఠశాల, చికిత్స పొందుతున్న హర్షిత

సూర్యాపేటక్రైం, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. విద్యార్థిని తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్దిరాల మండల కేంద్రానికి మంజూరైన మహాత్మాజ్యోతి బాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల విద్యాలయాన్ని అక్కడ సరైన వసతులతో కూడిన భవనం లేకపోవడంతో సూర్యాపేట జిల్లాకేంద్రం భగత్‌సింగ్‌నగర్‌లో ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ తొమ్మిదో తరగతి చదువుతున్న సూర్యాపేట మునిసిపాలిటీ పరిధిలోని బీబీగూడేనికి చెందిన వల్లపు సైదులు, సరిత దంపతుల రెండో కుమార్తె హర్షిత(14) సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లింది. అదే విద్యాలయంలో హర్షిత సోదరి సంగీత ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సెలవులకు ఇద్దరూ కలిసి ఇంటికి వెళ్లారు. సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం తల్లిదండ్రులు ఇద్దరినీ ఉదయం 10:50 గంటలకు విద్యాలయానికి తీసుకొచ్చారు. పెద్ద కుమార్తె సంగీత విద్యాలయంలోని మొదటి అంతస్తులోని ఆమె గదికి చేరుకుని అనంతరం తరగతి గదికి వెళ్లింది. హర్షిత మాత్రం రెండో అంతస్తులోని ఆమె గదికి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మూత్రశాలకు అటుగా వెళ్లిన సహచర విద్యార్థినులు గమనించి వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఉపాధ్యాయులు హర్షిత గదికి వెళ్లి చున్నీని తొలగించి కిందికి దింపారు. చిన్న కుమార్తె హర్షిత విద్యాలయంలోని హాస్టల్ గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుందని సుమారు గంట తర్వాత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్, సిబ్బంది హర్షితను ఆటోలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

బలవంతంగా పంపడంతోనే : జ్యోతి, ప్రిన్సిపాల్

హర్షిత అనారోగ్య కారణాలతో విద్యాలయానికి తరచూ గైర్హాజరవుతోంది. సెలవులకు ముందు నిర్వహించిన పరీక్షలను కూడా ఇంటి నుంచే వచ్చి రాసింది. సెలవులకు వెళ్లిన తర్వాత విద్యాలయానికి కొన్ని రోజుల తర్వాత రావాలని ఆలోచించింది. తల్లిదండ్రులు బలవంతంగా తీసుకురావడంతో మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసింది. విద్యాలయానికి వచ్చిన నిమిషాల వ్యవధిలోనే ఈ సంఘటన జరిగింది. ఈలోపు విద్యార్థినిని ఎవరూ ఏమీ అనలేదు.

ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియదు: సైదులు, విద్యార్థిని తండ్రి

హర్షిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారణాలు తెలియడం లేదు. ఇంటి నుంచి సంతోషంగానే పాఠశాలకు వచ్చింది. ఇద్దరు కుమార్తెలను పాఠశాలలో వదిలి వెళ్లాం. కాసేటికి ఆత్మహత్యాయత్నం చేసిందని సమాచారం ఇచ్చారు. పాఠశాలలో ఏదో జరిగి ఉంటుందని అనుమానం ఉంది. హర్షిత ఎప్పుడూ ఇబ్బందులు పడలేదు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	559.80
టీఎంసీలు	231.9106
ఎడమకాల్వకు నీటి విడుదల	7,272
కుడికాల్వకు	9,017
విద్యుత్ కేంద్రం ద్వారా	24,825
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	43,796 క్యూసెక్కులు

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	41.00 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.53 అడుగులు
టీఎంసీలు	3.34
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	228.81 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	121.81 క్యూసెక్కులు

గంజాయి విక్రయించేందుకు వచ్చి..

● అంతర్రాష్ట్ర ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు ● రెండు కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాలు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలై చోరీలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తమ సిబ్బందితో నార్కట్‌పల్లిలో ఉన్న మద్రాస్ ఫిల్టర్ కాఫీ సెంటర్ వద్ద నిఘా ఉంచారు. అవసరమున్న వారికి గంజాయి విక్రయించేందుకు నిందితులు మద్రాస్ ఫిల్టర్ కాఫీ సెంటర్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. నాంపల్లి మండలం నామనాయక్‌తండాకు చెందిన కొడావత్ విక్రమ్, మల్లేపల్లి మండలం దంజీరాల్‌తండాకు చెందిన వడ్త్య నాగరాజు, మిర్యాలగూడ మండలం కాల్వతండాకు చెందిన ధనావత్ సందీప్‌నాయక్, సంస్థాన్‌నారాయణపురం మండలం తుంబాయితండాకు చెందిన జరుప్లా నవీన్‌కుమార్ సులభంగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో రెండు కిలోల గంజాయిని తీసుకుని దొంగలించిన ద్విచక్రవాహనాలపై వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లలో విక్రయించేందుకు సిద్ధం చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, నాలుగు ద్విచక్రవాహనాలు, లెనోవా టాబ్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

గతంలో నిందితులపై పలు కేసులు

పట్టుపడిన నిందితులపై గతంలోనే పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. మైనర్‌గా ఉన్న సమయం నుంచే వారు గంజాయికి అలవాటు పడి దొంగతనాలు చేసేవారు. హయత్‌నగర్, ఎల్‌బీనగర్, యాచారం, చౌటుప్పల్, సరూర్‌నగర్, అచ్చంపేట, అబ్దుల్లాపూర్‌మెట్, ఘట్కేసర్, ఆదిబట్ల, త్రిపురారం, నాచారం, కొండమల్లేపల్లి, దేవరకొండ, ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్లలో వారిపై సుమారు 50కేసులు నమోదయ్యాయి. జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారని డీఎస్పీ తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పథకం ప్రకారం గంజాయి విక్రయించడంతో పాటు ఇనుప రాడ్డు సహాయంతో రాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళం పగలగొట్టి చోరీలకు పాల్పడేవారు. ద్విచక్ర వాహానాలు కూడా ఎత్తుకెళ్లేవారని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ, ఎస్‌ఐ డి. క్రాంతికుమార్, సిబ్బంది ఉన్నారు.

నేటినుంచి గ్రామసభల సందడి

(5వ పేజీ తరువాయి)

సహాయం అందించనుంది. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉండి 2023-24లో కనీసం 20రోజులు, ఆపై పని చేసిన వ్యవసాయ కూలీలకు ఈ పథకం వర్తించనుంది. జిల్లా కేంద్రాల నుంచి మండలాలకు ఇందిరమ్మ భరోసా ఆత్మీయ పథకం లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం జాబితాలు పంపింది. ఆ జాబితాల్లో కొందరికి భూమి లేకున్నా పేర్లు లేవని, మరికొందరికి భూమి ఉన్నా పేర్లు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. భూమి ఉన్న వారికి రైతు భరోసా ఇస్తున్నప్పుడు, వారికే మళ్లీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎలా ఇస్తారని గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. జాబితాలను పరిశీలించి అనర్హులను తొలగిస్తామని, వచ్చిన జాబితాలు, అందులో గుర్తించిన అనర్హుల జాబితాలు గ్రామ సభలో చదివి వినిపించి గ్రామ సభల తీర్మానం మేరకే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా భూమి ఉందా? లేదా? దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నారా? అనేది తెలుసుకుని అనర్హుల పేర్లు తొలగిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే గ్రామ సభలో ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే ఘర్షణలకు తావుండే అవకాశం ఉంది. ఉపాధి హామీ జాబ్ కార్డు పొందినప్పుడు వారికి భూమి ఉందా? లేదా? ఉంటే ఎంత భూమి ఉందనే వివరాలేవి నమోదు చేయడం లేదు. అందుకే భూమి ఉన్న వారి పేర్లు సైతం కొన్ని జాబితాల్లో వచ్చాయని, ఇది తుది లబ్ధిదారుల జాబితా కాదని అధికారులు పేర్కొంటున్నారు.

మునిసిపాలిటీల్లో ఆత్మీయ భరోసా లేనట్టే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. మునిసిపాలిటీల్లోని వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సహాయం అందించడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో నూతనంగా ఏర్పాటుచేసిన మునిసిపాలిటీల్లో పలు గ్రామాలను కలిపింది. దీంతో మేజరు గ్రామ పంచాయతీలు, చిన్న గ్రామపంచాయతీల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ పథకం వర్తించక ఉపాధి కోల్పోయారు. ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందక మరోసారి నష్టపోతున్నారు. మునిసిపాలిటీలు చేసినందున కూలీల బతుకులు మారలేదని, వారికి సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఉపాధి హామీ పథకాలు వర్తింపజేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో పరిశీలనకు 71,161 మంది కూలీల పేర్లు

యాదాద్రి జిల్లాలో 421 గ్రామ పంచాయతీల నుంచి 16,927 మంది, సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీల నుంచి 27,729 మంది, నల్లగొండ జిల్లాలో 845 గ్రామ పంచాయతీల నుంచి 26,505 మంది వ్యవసాయ కూలీల పేర్లతో ప్రభుత్వం నుంచి జాబితాలు వచ్చాయి. అవి ఇప్పటికే మండల అధికారులకు చేరగా, వాటిని గ్రామ, మండల స్థాయిలో పరిశీలిస్తున్నారు.


ముగిసిన సర్వే

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాల పరిశీలన సోమవారం ముగిసింది. మండలాల ఏపీవోలు ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శుల నుంచి సమాచారం తీసుకుని వారికి వచ్చిన ప్రతిపాదిత జాబితాల నుంచి భూమి ఉన్న వారి పేర్లను తొలగించారు. భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబంలో మహిళ పేరున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించనున్నారు. అందుకు అవసరమైన ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు సేకరించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహించనున్నారు.

సవాల్‌గా మారనున్న గ్రామసభలు

(ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్): అధికారులు ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే సభలు సవాల్‌గా మారనున్నాయి. తాత్కాలికంగా గుర్తించిన అర్హుల పేర్లను గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదింపజేయాల్సి ఉంది. దీంతో గ్రామసభల్లో పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం ఉండటంతో అధికారులకు తలనొప్పిగా మారనుంది. దీంతో నాలుగు రోజులు సభలు ఎలా నిర్వహించాలని, ప్రజలకు ఎలా సర్దిచెప్పాలనే విషయం వారికి అంతుబట్టడం లేదు.


మునిసిపాలిటీల్లోని కూలీలకు అందేలా కృషి



మునిసిపాలిటీల్లోనూ భూమిలేని వ్యవసాయ కూలీలు ఉన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మునిసిపాలిటీల్లోని వ్యవసాయ కూలీలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేలా కృషి చేస్తా.

● మందుల సామేలు, తుంగతుర్తి ఎమ్మెల్యే

ఉపాధి పనులకు వెళ్లినా పేరు లేదు



మా కుటుంబానికి భూమి లేదు. నేనూ, నా భర్త కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాం. సుమారు 18 ఏళ్లుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పరిశీలనకు వచ్చిన జాబితాలో నా పేరు లేదు. అందులో భూమి ఉన్న వారి పేర్లు కూడా ఉన్నాయి. రైతు భరోసాలో లబ్ధిపొందుతున్న వారికే మళ్లీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో పేరు రావడం ప్రభుత్వ తప్పుడు నిర్ణయానికి నిదర్శనం.

● పాశం యమున, వ్యవసాయ కూలి, ఆత్మకూరు(ఎం).

సర్వే మేరకే జాబితా

ఏడాదిలో 20 రోజులపైగా ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు వ్యవసాయ కూలీల జాబితాలు పరిశీలనకు వచ్చాయి. పక్కాగా భూమి లేని వారికే ఈ పథకం వర్తిస్తుంది. జాబితాల్లో భూమి ఉన్న వారి పేర్లు ఉంటే మండల స్థాయి అధికారులు వారి పరిశీలనలో గుర్తించి తొలగిస్తారు. గ్రామ సభలో వివరాలు ప్రజల ముందు ఉంచుతారు. జాబితాలో ఎవరి పేరు లేకున్నా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలించి పథకం వర్తింపజేస్తాం.

● నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి భువనగిరి.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మోత్కూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులోని ఆంజనేయస్వామి ఆలయ వీధిలో ఆదివారం రాత్రి జరిగింది. వీధిలోని మెండె అండాలు ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేచాయి. గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకున్నాయి. దీంతో ఇంట్లోని వస్తువులు, దాచుకున్న రూ.18వేల నగదు, తులమున్నర బంగారు ఆభరణాలు మంటల్లో కాలిపోయాయని బాధితురాలు వాపోయింది. నిరుపేదనైన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది. సిలిండర్ లీకై మంటలు లేచినప్పుడు అండాలు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

నల్లగొండ

నకిరేకల్ - మునుగోడు


● పట్టణంలో ట్రాఫిక్‌తో నిండిపోయిన ప్రధాన చౌరస్తా

ట్రా'ఫికర్'

» ట్రాఫిక్ నిబంధనలు బేఖాతర్
» ఇబ్బందులు పడుతున్న చండూరు ప్రజలు

చండూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య నిత్యకృత్యమవుతుంది. ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్ల పైనే వాహనాలు నిలిపివేయడంతో పాటు యూటర్న్ తీసుకుంటూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పోలీసులు కేవలం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులకే పరిమితం కావడంతో వాహనదారులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయి.
- (ఆంధ్రజ్యోతి,చండూరు)

పట్టణంలో వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. బస్టాండ్, ప్రధాన సెంటర్లు, విద్యాసంస్థల వద్ద వాహనాలను తమ ఇష్టానురీతిగా నిలిపివేస్తున్నారు. అకస్మాత్తుగా వాహనాలను ఆపుతుండటంతో వెనక నుంచి వచ్చే వాహనాలు అదుపు తప్పిపోవడం, ఢీకొట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రోడ్లపైనే వ్యాపారాలు

దినదినాభివృద్ధి చెందుతున్న చండూరు పట్టణం తోపుడు బండ్లు, దుకాణాల నిర్వాహకులు రోడ్లపైకి వచ్చి తమ వ్యాపారాలను కొనసాగించేందుకు సూచిక బోర్డులు పెడుతున్నారు. కొంతమంది రోడ్లపై బండ్లు పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గుండ్రాపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండడంతో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంఈవో కార్యాలయాలు గుండ్రాపల్లికి వెళ్లే దారిలో ఉండటం కార్యాలయాలకు పనుల నిమిత్తం వెళ్లే వారికి ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.

నెంబర్ ప్లేట్లు లేకుండానే ప్రయాణాలు

పట్టణంలో పోలీసులు కేవలం డ్రండెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారని, ఇతర అంశాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది వాహనదారులు నెంబర్ ప్లేట్లు లేకుండానే రోడ్లపైకి వస్తున్నారు. అలాంటి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని పేర్కొంటున్నారు. పోలీసులు తన ఖీలు ముమ్మరం చేసి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఉపశమనం

చండూరు మునిసిపాలిటీలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు వెచ్చించింది. పట్టణంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వార సంతకు మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, కనగల్, గుర్రంపోడు, మాల్, నల్లగొండ, నారాయణపురం, చౌటుప్పల్, గట్టుప్పల మండలాలకు చెందిన వ్యాపారులు క్రయ, విక్రయాల కోసం వస్తుంటారు. సంతకు వచ్చేవారికి కనీస సదుపాయాలు లేకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే మాంసం, కూరగాయలు, ఇతర విక్రయాలు జరుగుతుండటంతో వ్యర్థాలతో రోడ్డు అపరిశుభ్రంగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో 2023 జనవరి 6న సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి, అప్పటి పురపాలక శాఖా మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి రెండేళ్లు పూర్తి కావస్తున్నా, నేటికీ పూర్తి కాకపోవడంతో చిరువ్యాపారులు, మాంసపు దుకాణదారులు రోడ్డు వెంట విక్రయాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు, ఆహార పదార్థాలు, మాంసం కలుషితమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీకృత మార్కెట్ భవనం నిర్మాణం పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుంది.

సంత రోజు తీవ్ర సమస్య

చండూరు చౌరస్తాలో ప్రతీ శుక్రవారం వార సంత జరుగుతుంది. మునిసిపాలిటీ కార్యాలయం వెనక, రోడ్డు వెంట సంత సాగుతుండటంతో ప్రజలంతా ఒక చోట గుమిగూడుతుంటారు. వాహనాలు సైతం అక్కడే నిలిపి విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. సాయంత్రం వేళలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ పాఠశాలల బస్సులు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో ప్రజలు రోడ్డు దాటే పరిస్థితి ఉండదు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షితంగా గమ్యానికి చేరుకుంటారు. ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపొద్దు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారికి ఈ చలానా కేసులు నమోదు చేస్తాం.
- వెంకన్న, ఎస్ఐ, చండూరు



కానరాని పోలీసు సిబ్బంది

చండూరులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టించుకోవడం లేదు. వార సంత రోజైనా ట్రాఫిక్ నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇష్టానురీతిగా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో నిత్యం ప్రమాదాలు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్ నియంత్రించడంలో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 11 కేవీ విద్యుత్ లైన్‌లలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశంబజార్, మాన్యంచెల్క ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

చిట్యాల, జనవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 21న ఉదయం 9 గంటలకు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బస్‌పాస్ లేని దివ్యాంగులు తమ సదరం సర్టిఫికెట్లు తీసుకువచ్చి బస్‌పాస్ పొందాలని ఆయన కోరారు.

నరసింహ మృతి పార్టీకి తీరనిలోటు

గట్టుప్పల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, గీత కార్మిక సంఘం నాయకుడు బొడిగ నరసింహ మృతి సీపీఎంకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా సెక్రటేరియేట్ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. సోమవారం నరసింహ మృతదేహంపై ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం


మునుగోడులో రహదారి విస్తరణ పనులు చేస్తున్న దృశ్యం

మునుగోడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రహదారుల విస్తరణ అభివృద్ధి కోసం రూ. 24 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో చౌటుప్పల్ రహదారి నుంచి నల్లగొండ రహదారి వంతెన వరకు 2.4 కిలోమీటర్ల దూరం రహదారి నాలుగు వరుస లో నిర్మాణానికి రూ.14కోట్లు, మునుగోడు అమరవీరుల చౌరస్తా నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దాటిన తర్వాత 100 మీటర్లు వరకు 1.5 కిలోమీటర్లు దూరం రూ. 10కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే చౌటుప్పల్ రహదారిలోని ప్రభుత్వ కార్యాలయాల ఎదుట డ్రైనేజీ పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం ప్రధాన కూడలిలోని వ్యాపార సముదాయాలు ఉన్న చోట వెడల్పు కోసం రహదారికి ఇరువైపులా 66ఫీట్లు వెడల్పుతో అధికారులు కొలతలు వేసి మార్కింగ్ చేశారు. ఈ మేరకు యజమానులకు నోటీసులు ఇవ్వగా భవన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ వెడల్పు పనులు మొదలు పెట్టినట్లు ఆర్అండ్‌బీ జేఈఈ శిరీష్‌కుమార్ తెలిపారు. రహదారి విస్తరణ ప నులు సకాలంలో పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

లక్ష డప్పుల ప్రదర్శనను విజయవంతం చేయాలి

నాంపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శనలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అన్నారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించే మహాప్రదర్శనను విజయవంతం చేయాలని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహాప్రదర్శనకు ఇంటికో డప్పుతో పాల్గొనాలని కోరుతూ ఏపూరి సోమన్న కళాకారుల బృందం ప్రచారం చేసింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బూషిపాక నరేష్, నా యకులు జోగు వెంకటయ్య, నరపాక విజయ్, ఎదుళ్ల యాదగిరి, నాగరాజు, శివ, ప్రవీన్, ఏడుకొండలు, నర్సింహ పాల్గొన్నారు.

పూజా సామగ్రి విక్రయాలకు బహిరంగ వేలం

నల్లగొండకల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పానగల్లులో గల శ్రీ ఛాయా సోమేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో కొబ్బరికాయలు, పూజా సామగ్రిని విక్రయించేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా దేవాదాయశాఖ ఏసీ కె.భాస్కర్, ఆలయ ఈవో రాపోలు బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితితో కొబ్బరికాయలు, పూజా సామగ్రిని విక్రయించేందుకు ఈ నెల 24వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ముందుగా రూ. 30 వేల డిపాజిట్‌ను చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కట్టంగూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. కట్టంగూరులో సోమవారం సీపీఎం నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిలుముల రామస్వామి, మురారి మోహన్, ఇటుకల సురేందర్, కట్ట బక్కయ్య, జాల రమేష్, ఆంజనేయులు, సైదులు పాల్గొన్నారు.

'మా భూములు మాకు ఇవ్వాలి'

నకిరేకల్, జనవరి 20: ఆక్రమణకు గురైన మా భూములు మాకు ఇప్పించాలని తాటికల్ గ్రామానికి చెందిన పలువురు కోరారు. గ్రామానికి చెంది 120 ఎస్సీలు సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి జమీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలోని 120మంది ఎస్సీలకు అర ఎకరం చొప్పున 2004లో అసైన్డ్ భూమి పట్టా ఇచ్చారని తెలిపారు. ఆ భూమిని గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణానికి చెందిన వారు మా భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 2004 నుంచి తాము పట్టాలచ్చిన భూమిలో కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అసైన్డ్ భూమి పట్టాలు ఉన్న తమకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అమెరికాలో రవితేజ హత్యపై కంచర్ల దిగ్భ్రాంతి

నల్లగొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణవాసి కొయ్యడ రవితేజ అమెరికాలో దారుణహత్యకు గురికావడంపై మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోవద్దని కోరారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి, జి.ఎడవెల్లి సింగిల్‌విండో చైర్మన్ దోటి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రగాఢ సంతాపం తెలిపారు. రవితేజ తల్లిదండ్రులు చంద్రమౌళి, సువర్ణలు నల్లగొండ పట్టణంలోని తిరుమలనగర్‌లో నివాసం ఉన్నారని తెలిపారు. ఇటీవలే హైదరాబాద్‌కు వెళ్లారని పేర్కొన్నారు.

'ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి'

నాంపల్లి, శాలిగౌరారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ నాంపల్లి మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయనపై జరిగిన దాడికి నిరసనగా మండలంలోని ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కప్పరాజు వెంకన్న, పల్లెటి వెంకటయ్య, రాసమళ్ల శ్రవణ్‌కుమార్, యాదయ్య, సంపత్, యుగేందర్ పాల్గొన్నారు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం, ఉపాధ్యాయులు వై.లింగారెడ్డి, కె. రాములు, ఎస్.వెంకన్న, కె.యాదగిరి పాల్గొన్నారు.

లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

కట్టంగూరు, మర్రిగూడ, చండూరు రూరల్, శాలిగౌరారం, చిట్యాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ జేడీ కోటేశ్వర్ రావు అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరాల్లో సోమవారం వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్ కార్డుల పంపిణీకి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక కోసం ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించి గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గ్రామసభల ద్వారా పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. నేటి నుంచి పలు గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రజలు అడిగే ప్రతి ప్రశ్నకు జవాబుదారీగా ఉండాలని ఆయన సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీవో చింతమల్ల చలపతి, ఏవో గిరిప్రసాద్, డీటీ సుకన్యలు ఉన్నారు.

● మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మున్నయ్య మాట్లాడారు. 21న రాంరెడ్డిపల్లి, లెంకలపల్లి, మర్రిగూడ, ఎర్రగండ్లపల్లి, శివన్నగూడ, 22న మేటి చందాపురం, వట్టిపల్లి, తమ్మడపల్లి, దామెరబీమనపల్లి, అంతంపేట, 23న కొట్టాల, అజలాపురం, కొండూరు, కుదాభక్షపల్లి, నామాపురం, 24న రాజుపేటతండా, లెంకెపల్లి, కమ్మగూడెం, తిరుగండ్లపల్లి, సరంపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు తప్పకుండా గ్రామసభలకు హాజరుకావాలని కోరారు.


చండూరు ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంరెడ్డి

● చండూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామసభలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎంపీడీవో రాంరెడ్డి విడుదల చేశారు. 21వ తేదీన మంగళవారం ఉమ్మడి చండూరు మండలంలోని గొల్లగూడెం, కమ్మగూడెం, బంగారిగడ్డ, జోగిగూడెం, పుల్లెంల, గట్టుప్పల్, తాస్కానిగూడెం గ్రామాలలో, 22న చామలపల్లి, శేరిగూడెం, ఉడుతలపల్లి, నెర్మట, తేరట్‌పల్లి, కస్తాల గ్రామాల్లో, 23న గుండ్రపల్లి, తుమ్మలపల్లి, దోనిపాముల, కొండాపురం, బోడంగిపర్తి, 24వ తేదీన శిర్దేపల్లి, చొప్పరివారిగూడెం, తిమ్మారెడ్డిగూడెం, ఇడికూడ, పడమటితాళ్ల గ్రామాల్లో నిర్వహిస్తారని, ఈ గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి. దశరథ, ఏవో చంద్రిక, ఎంపీవో మాధవరెడ్డి, సూపరింటెండెంట్ నర్సింహ, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలో నేటి నుంచి 24వ తేదీ వరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభలు నిర్వహించి వివిధ పథకాలపై లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఈ దరఖాస్తుల పరిశీలనపై అధికారులు ఆరు బృందాలు ఏర్పడి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు.

● చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఈ నెల 21 నుంచి వార్డు సభలు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ వీరేందర్ తెలిపారు. ఈ నెల 21న 1వ వార్డు నుంచి 4వార్డు, 22న 5వ వార్డు నుంచి 8వార్డు, ఈ నెల 23 న 9వ వార్డు నుంచి 12వ వార్డుల్లో వార్డు సభలు ఆయా వార్డుల పరిధిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.


మర్రిగూడలో మాట్లాడుతున్న ఎంపీడీవో మున్నయ్య

కమిటీ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి : మంత్రి

కనగల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆలయ అభివృద్ధితో పాటు దేవస్థానం వద్ద భక్తులకు మెరుగైన వసతులను కల్పించేందుకు కృషి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆలయప్రాంగణంలో సోమవారం మంత్రి వెంకట్‌రెడ్డి సమక్షంలో ఆలయ చైర్మన్‌గా చీదేటి వెంకట్‌రెడ్డితో పాటు మరో 14మంది పాలకమండలి సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ పాలక సభ్యులుగా ఎన్నికైన వారు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ఎల్లమ్మతల్లి ఎంతో మహిమ గల దేవత అని అన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ కమిటీ నూతన చైర్మన్ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన వసతులను కల్పించేందుకు పెద్దపీట వేస్తానని అన్నారు. ఆలయ అభివృద్ధికి మంత్రి సహకారం తీసుకుంటానన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు మంత్రి శాలువాలు కప్పి సత్కరించారు. అంతకుముందు మంత్రితో కలిసి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఎండోమెంట్ ఏసీ భాస్కర్, తహసీల్దార్ పద్మ, ఈవో జయరామయ్య, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ చైర్మన్లు దేప కరుణాకర్‌రెడ్డి, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి మాజీ సర్పంచులు గోలి జగాల్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శంకర్‌రెడ్డి

● మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి

శాలిగౌరారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు మౌలిక వసతుల కల్పనకు పాలక మండలి సహకారంతో కృషి చేస్తానని శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ పాలకమండలి మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ డైరెక్టర్ల పరిచయం, మార్కెట్ అభివృద్ధి, నూతనంగా నిర్మించిన కార్యాలయం ప్రారంభం గురించి సమావేశంలో చర్చించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు సహకారంతో మార్కెట్‌ను అన్ని విధాలుగా కృషి చేస్తానని చైర్మన్ శంకర్‌రెడ్డి అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. మార్కెట్ అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి డైరెక్టర్లు సహకరించాలన్నారు. మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, డైరెక్టర్లు పడాల రమేష్, కుతాటి సోమయ్య, తాందారి సత్తయ్య, రాజుల శ్రీనివాస్, గైగుళ్ల అవిలయ్య, దేవరకొండ జయరాజు, బండపల్లి అంజమ్మ, షేక్ లతీఫ్, బోడ దానయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీగా పాలన : బీఆర్ఎస్

నార్కట్‌పల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని తలపించే విధంగా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగుతోందని జడ్పీ మాజీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ధ్వజమెత్తారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని సోమవారం నార్కట్‌పల్లిలోని చిరుమర్తి నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. రైతులను మోసం చేసిన రేవంత్ సర్కార్‌ను ప్రజల్లోనే ఎండగట్టేందుకు నల్లగొండలో ఈనెల 21వ తేదీన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యే రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. కేటీఆర్ అంటే ఈ ప్రభుత్వానికి భయమెందుకని వారు ప్రశ్నించారు. ధర్నాకు ప్రభుత్వం అనుమతించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించైనా నల్లగొండలో మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. తమది ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ప్రజల పక్షాన కేటీఆర్ పోరాటం చేస్తామంటే ధర్నాకు ఎందుకు అడ్డంకులు సృష్టిస్తుందో చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, నాయకులు యానాల అశోక్‌రెడ్డి, దుబ్బాక శ్రీధర్, కర్నాటి ఉపేందర్, బొక్క భూపాల్‌రెడ్డి, మహేశ్వరం సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండా నరేందర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి మృతి

● నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


కల్లూరి యాదగిరి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే ఎంఎల్‌ఏ వేముల వీరేశం


కల్లూరి యాదగిరి (ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి ఆదివారం రాత్రి మృతి చెందారు. రక్తపోటు సమస్యతో మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన యాదగిరిని కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఎల్లారెడ్డిగూడెంలో ప్రజల మనిషి గా పేరొందిన కల్లూరి యాదగిరి అకాల మృతిపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ పార్టీ ఓ పోరాట యోధుడిని కోల్పోయిందని సీపీఎం సంతాపం ప్రకటించింది. యాదగిరికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కల్లూరి యాదగిరి కడసారి చూపు కోసం పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రు నయనాల నడుమ ప్రజానాట్యమండలి కళాకారుల ఆట పాటలతో జోహార్లు అర్పిస్తూ అంతిమయాత్ర నిర్వహించి దహన కార్యక్రమాలు నిర్వహించారు.


ప్రముఖుల నివాళి: మాజీ వైస్ ఎంపీపీ, సీపీఎం నేత కల్లూరి యాదగిరి అకాల మృతికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ.జహంగీర్, చింతపల్లి బయ్యన్న, మాజీ ఎంపీపీలు రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలి

కేతేపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని బడిఈడు పిల్లలను విధిగా పాఠశాలకు పంపించాలని ఇనుపాముల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ముషం వెంకటేశ్వర్లు అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండలంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. ఇనుపాముల గ్రామంలో నిర్వహించిన సర్వేలో ఇటుక బట్టీల్లో పనికి వలస వచ్చిన ఇద్దరు కూలీల పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు సీఆర్పీ కంచర్ల మహేందర్, జడ్పీ, పీఎస్ హెచ్‌ఎంలు ముషం వెంకటేశ్వర్లు, కొంగర శోభ పిల్లలను బడికి పంపకంపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కట్టంగూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొండ లింగస్వామిగౌడ్ తండ్రి శంకరయ్య (74) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీరేశం సోమవారం శంకరయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా అయిటిపాముల గ్రామానికి చెందిన నర్సింహాచారి షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోవడంతో ఆయన పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, సుక్కయ్య, జెల్లా ముత్తిలింగం, సాగర్, సాయిలు, సైదులు, లింగయ్య, పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 72

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.144	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.130	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 , కనిష్ఠం 16.0



కొత్త పాస్‌పుస్తకాలకు సైతం రైతు భరోసా

ఏఈవోలకు దరఖాస్తు చేసుకునే అవకాశం

నల్లగొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పట్టదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సైతం రైతు భరోసా ఇచ్చేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొద్ది రోజులుగా కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా వస్తుందా? లేదా? ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం కొత్త పాస్‌పుస్తకాలకు సైతం భరోసా చెల్లిస్తామని ప్రకటించింది. మంగళవారం నుంచి కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఏఈవోలకు దరఖాస్తులు చేసుకోవాలని జేడీఏ పి.శ్రవణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి వరకు కొత్త పాస్‌పుస్తకాలు పొందిన వారంతా వారి బ్యాంక్ ఖాతా నెంబర్‌తో పాటు పాస్ పుస్తకాల నెంబర్లను అధికారులకు అందజేయాలని, దీంతో ఈనెల 26 నుంచి వారికి సైతం రైతుభరోసా అందుతుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగో విడత రుణమాఫీ జమ

నాలుగో విడత రుణమాఫీకి సంబంధించిన నగదు అర్హులైన రైతుల ఖాతాల్లో జమ అవుతోందని నల్లగొండ జేడీఏ శ్రవణ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీకి సంబంధించి జిల్లాకు రూ.236.90కోట్లు జమ చేసిందన్నారు. మొదటి విడతగా 99,839మంది రైతులకు రూ.579.14కోట్లు, రెండో విడతగా 54,551మంది రైతులకు రూ.632.92కోట్లు, మూడో విడతలో 33,804మంది రైతులకు రూ.55.92కోట్లు రుణమాఫీ రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. నాలుగో విడత రుణమాఫీ నగదు రూ.236.90కోట్లను 21,432 మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నదని, ఈ ప్రక్రియ ప్రారంభమైందని ఆయన తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రైతు సమస్యలపై బీఆర్ఎస్ నిర్వహించతలపెట్టిన మహాధర్నాకు అనుమతి నిరాకరించడంతో రెండు పార్టీల మధ్య మాటల మంటలు చెలరేగాయి. ప్రతిపక్షాలు అధమస్థాయికి దిగజారి వ్యవహరిస్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు చేయగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేయలేక బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలను అడ్డుకుంటోందని మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం నుంచి గ్రామసభలకు ప్రభుత్వం సిద్ధమైన సందర్భంలో ఉమ్మడి జిల్లాలో అధికార, ప్రతిపక్షాల నడుమ ఢీ అంటే ఢీ అనే పరిస్థితి ఏర్పడడంతో రాజకీయం రసవత్తరంగా మారింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు (ఫైల్)

నీలగిరిలో వేడెక్కిన రాజకీయం

- బీఆర్ఎస్ మహాధర్నా మరోసారి వాయిదా
- ధర్నాకు పోలీసుల అనుమతి నిరాకరణ
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అడ్డుకుంటున్నారని అధికార పక్షంపై బీఆర్ఎస్ ఆరోపణలు
- ప్రతిపక్షాలు అధమ స్థాయికి దిగజారాయని వ్యాఖ్యానించిన మంత్రి కోమటిరెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార, ప్రతిపక్షాలు

రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లాల వారీగా రైతు మహాధర్నాలకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యే ఈ ధర్నాలను ఆ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా మహాధర్నాను నల్లగొండలో తొలుత ఈనెల 12న నిర్వహించాలని అనుకున్నా సంక్రాంతి పండుగ కారణంగా వాయిదా వేశారు. దీన్ని ఈనెల 21న నిర్వహించాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహించే ఈ ధర్నాకు పోలీసుల అనుమతి కోరారు. అయితే ప్రభుత్వం ఈ నెల 21 నుంచి గ్రామసభలు నిర్వహించాల్సి ఉండడం, 26న గణతంత్ర దినోత్సవం ఉండడం, ధర్నా చేపట్టే ప్రాంతం జాతీయరహదారిపై ఉండడంతో సరైన భద్రత కల్పించలేమని, ఈ నేపథ్యంలో మహాధర్నాకు అనుమతి ఇవ్వలేమని పోలీసులు పేర్కొన్నారు. దీంతో సోమవారం హైకోర్టు నుంచి అనుమతి కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించినా, కోర్టు సైతం ఈ పిటిషన్‌పై విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది.

దీంతో బీఆర్ఎస్ సైతం మహాధర్నాను వాయిదా వేసింది. మహాధర్నాను వాయిదా వేశామే తప్ప, విరమించడం లేదని, హైకోర్టు నుంచి ఆదేశాలు వచ్చాక ధర్నా నిర్వహించి తీరుతామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. మరోవైపు మంగళవారం నుంచి నిర్వహించే గ్రామసభల్లో ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది.

స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగానే

ఫిబ్రవరి రెండోవారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందనే సంకేతాల నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలో అధికార...

- మిగతా 6వ పేజీలో...



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నేటి నుంచి గ్రామసభల సందడి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో అనర్హులు

మునిసిపాలిటీల్లో కూలీలకు వర్తించని పథకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈ నెల 26 నుంచి అమలు చేయనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా అధికారులు అర్హుల ఎంపికకు సర్వే నిర్వహిస్తున్నారు. గుర్తించిన అర్హుల జాబితాను ఆమోదించేందుకు గ్రామ సభలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి గ్రామసభల సందడి నెలకొననుంది.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించిన సర్వే ముగిసింది. సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో దీనిపైనా పెద్దగా పేచీ లేదు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి లబ్ధిదారుల ఎంపికకు జరుగుతున్న సర్వేపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేసినా గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి ప్రభుత్వానికి జాబితాలు వెళ్లేవి. అందుకు భిన్నంగా ఇప్పుడు జాబితాలను ప్రభుత్వమే రూపొందించి పరిశీలనకు అధికారులకు పంపుతోంది. ఇదేం తిరకాసని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మీయ భరోసాలో అనర్హులకు చోటు

భూమి లేని వ్యవసాయ కూలీలకు విడతకు రూ.6వేల చొప్పున రెండు విడతలుగా ఏడాదికి రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింది ప్రభుత్వం ఆర్థిక...

- మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ పథకాలు నిరంతరాయంగా

కొనసాగుతాయి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతరం కొనసాగుతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హుల జాబితాలో పేర్లు లేకుంటే ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. గ్రామ సభల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. గ్రామసభల సమాచారాన్ని టాంటాం ద్వారా ప్రజలకు ముందుగానే తెలియజేయాలన్నారు. పథకాల కింద అర్హులైన జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు.

గ్రామసభల నిర్వహణ బాధ్యత ఏపీవోలదని, తీర్మానాలన్నింటినీ భద్రపరిచే బాధ్యత, డేటా ఎంట్రీ ఎంపీడీవోదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు నమోదు చేసుకొని గ్రామసభ తీర్మానం మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు వివరాలను ఎంపీడీవో లాగిన్ ద్వారా జిల్లా స్థాయికి, తద్వారా రాష్ట్ర స్థాయికి పంపించాలన్నారు. కార్డుల్లో కొత్తగా పేర్లను జోడించేందుకు తహసీల్దార్ లాగిన్ ద్వారా డీఎస్‌వోకు, అక్కడి నుంచి కలెక్టర్ ద్వారా రాష్ట్రస్థాయికి పంపించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో పేర్ల జోడింపునకు సుమారు 77వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై వచ్చిన అభ్యంతరాలను 10 రోజుల్లో పరిష్కరించాలన్నారు. 'ప్రజావాణి' దరఖాస్తులన్నింటినీ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌పై సన్నబియ్యం

వారం రోజుల్లో రైతు భరోసా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



తిప్పర్తి మండల కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన అర్హులందరికీ రేషన్‌కార్డుపై సన్నరకం బియ్యాన్ని పంపిణీ చేస్తామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పజ్జూరు గ్రామంలో జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించిన నూతన గోదాంను, నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో కనీసం 4వేల రేషన్ కార్డులు కూడా పంపిణీ చేయలేదన్నారు. ఫిబ్రవరి 1వ తేదీలోపు 40లక్షల రేషన్ కార్డులు పేదలకు అందజేస్తామన్నారు. కనీసం 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేదలందరికీ ఆరు నెలలకు ఒకసారి రూ.6వేలు వారి బ్యాంక్ ఖాతాలో జమచేస్తామన్నారు. మండలంలో మామిడాల, పజ్జూరు గ్రామాల రోడ్లను డబుల్‌లేన్లుగా విస్తరిస్తున్నామన్నారు. మంగళవారం నుంచి నిర్వహించే గ్రామ సభల్లో సమస్యలను విన్నవించుకొని పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించి పనులను త్వరతగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, కిసాన్ క్రెడిట్ కార్డులపై రైతులకు అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా బ్యాంకు నిర్వాహకులు చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ సభ్యుడు పాశం రాంరెడ్డి, సహకార బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి లింగారావు, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పాదూరి శ్రీనివా‌స్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

(ఆంధ్రజ్యోతి, కనగల్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం సాగర్ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తిమ్మన్నగూడెం మీదుగా కనగల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులకు తిమ్మన్నగూడెం మంత్రి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలిందన్నారు. సుమారు రూ.7లక్షల కోట్ల అప్పులు కాగా, రూ.2వేల కోట్లను ప్రభుత్వం వడ్డీ రూపంలో చెల్లిస్తోందన్నారు. నిధుల కొరత ఉన్నా, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారన్నారు. జిల్లాకు సాగు తాగు నీటికి శాశ్వత పరిష్కారమైన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను రెండేళ్లలో పూర్తి చేయిస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని కేటీఆర్ ఇప్పుడు దొంగ దీక్షలకు దిగుతాననడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకుముందు కనగల్ హైస్కూల్‌ను మంత్రి సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రూ.10లక్షల నిధులతో మినరల్‌వాటర్ ప్లాంట్, టాయిలెట్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాత్రి వేళ్లలో కొందరు పాఠశాల ఆవరణలో మద్యం తాగి సీసాలు పగలగొట్టి వెళ్తున్నారని విద్యార్థులు ఆయన దృష్టికి తేగా, వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కనగల్‌లో జంక్షన్ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ డీఈ గణేష్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, జడ్పీ మాజీ సభ్యుడు నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, గడ్డం అనూప్‌రెడ్డి, భారతవెంకటేశం, దేపకరుణాకర్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, గోలి జగాల్‌రెడ్డి, భిక్షంయాదవ్, హఫీజుద్దీన్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

ఎమ్మెల్యే బీఎల్ఆర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలపై మంగళవారం నుంచి జరిగే గ్రామ సభల్లో దరఖాస్తుదారుల పేర్లను చదవి ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలను గుర్తించి పథకాలు అందేట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, మునిసిపల్ కమిషనర్ ఎండీ యూసూఫ్, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో పాల్గొన్నారు.

మార్చిలో వస్తానన్నాడు

ఇంతలోనే ఘోరం

- అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య
- దుండగుల కాల్పుల్లో అక్కడికక్కడే మృతి
- ఫుడ్ డెలివరీ చేసి వస్తుండగా ఘటన
- వివరాలు ప్రధాన సంచికలో..

రాధేయ సాహిత్య కృషి అజరామరం

ఆచార్య మసన చెన్నప్ప



రాధేయ పురస్కారాన్ని అందుకుంటున్న సాహితీవేత్త మల్లిఖార్జున్

నల్లగొండ కల్చరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో మాతృకవి రాధేయ విశిష్టమైన సేవలు అందించారని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. సోమవారం రాచమల్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ మాతృకవి రాధేయస్మారక పురస్కార ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. అమ్మను, అంబేడ్కర్‌ను, అన్నను అత్యున్నతంగా ఆరాధించిన వాడు రాధేయ అని అన్నారు. అనంతరం నల్లగొండకు చెందిన సాహితీవేత్త డాక్టర్ చింతోజ మల్లిఖార్జున్‌కు మాతృకవి రాధేయ పురస్కారం, మాతృమూర్తి లచ్చమ్మ పురస్కారాన్ని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య సూర్య ధనుంజయకు అందజేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు రాచమల్ల శ్యాంసుందర్, వెంకటరాజయ్య, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, వెంకటేశ్వర్లు, ఆంజయ్య, అనిత, ఐలయ్య, శ్రీవాణి, డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అభివృద్ధి చేశాం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

రామగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణాన్ని అధికార, ప్రతిపక్ష పార్టీ అనే వివక్ష లేకుండా అన్ని వార్డులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేశామని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రజలందరూ ఎదురుచూస్తున్న మాస్టర్ ప్లాన్ అతిత్వరలో రానున్నట్లు తెలిపారు. కొంతమంది ఫుట్‌పాత్‌లను ఆక్రమించి డబ్బా దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయిలకు ఇస్తూ దందా చేస్తున్నారని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలని, అందుకు కౌన్సిల్ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. 2012-13 సంవత్సరానికి సంబంధించి స్టాంప్ డ్యూటీ మునిసిపాలిటీకి రూ.24కోట్లు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఇంకా రూ.12కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం కౌన్సిల్‌కు సంబంధం లేకుండా పనులు చేపట్టడం, కౌన్సిలర్లను అవమానపరిచేలా చేశారని విమర్శించారు. కానీ, ఈ 11 నెలల కాలంలో కౌన్సిల్ సభ్యులకు గౌరవిస్తూ ప్రతీ వార్డుకు సమాన నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం అభినందనీయమని కొనియాడారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

హాలియా, పెద్దఅడిశర్లపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాల అమలు కోసం ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నది. ఈ సభల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డు పథకాలకు అర్హులను ఎంపిక చేసి పథకాలను వర్తింపచేయనున్నది. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకొని తమ అభ్యంతరాలు, సూచనలు తెలిపి గ్రామ సభలను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

గ్రామసభల వివరాలు

అనుముల మండలంలో

తేదీ గ్రామాలు

21న అన్నారం, ముక్కమాల, తిమ్మాపురం,కొత్తపల్లి, పంగవానికుంటలో, పంగవానికుంటతండా, వీర్లగడ్డతండా

22న పులిమామిడి,రామడుగు, శ్రీనాథపురం, చింతగూడెం, మారేపల్లి, పాలెం, యాచారం

23న చల్మారెడ్డిగూడె, కొట్టాల, కొరివేనిగూడెం, నాయుడుపాలెం, హజారీగూడెం, మదారిగూడెం, పేరూరు

హాలియా మున్సిపాలిటీలో..

21న వార్డు ఇబ్రహీంపేట ప్రైమరీ స్కూల్‌లో, 5వ వార్డు అంగన్‌వాడీ స్కూల్‌లో, 9వ వార్డు ప్రైమరీ స్కూల్‌లో

22న 2వ వార్డు అలీనగర్ ప్రైమరీ స్కూల్‌లో, 6వ వార్డు అంగన్‌వాడీ సెంటర్ బొడ్రాయి వద్ద, 10వ వార్డు ప్రైమరీ స్కూల్ బొడ్రాయి వద్ద

23న 3వ వార్డు ప్రైమరీ స్కూల్ ఎస్సీ కాలనీ, 7వ వార్డు ప్రైమరీ స్కూల్ అనుముల, 11వ వార్డు హాలియా పబ్లిక్ స్కూల్‌లో

24న 4వ వార్డు గణేష్ మండపం, 8వ వార్డు ప్రైమరీ స్కూల్ అనుముల, 12వ వార్డు న్యూకిడ్స్ స్కూల్‌లో

పెద్ద అడిశర్లపల్లిలో...

21న పోల్కంపల్లి, మాదాపురం,అంగడిపేటఎక్స్ రోడ్డు అక్కంపల్లి, మేడారం, తిరుమలగిరి, రోళ్లకల్లు, కోదండపురం

22న అజ్మాపురం, ఎర్రగుంటతండా, మునావత్‌తండా, రాంపురం, దుగ్యాల, గుడిపల్లి, కేశంనేనిపల్లి, చింతల్‌తండా,

23న ఘట్‌నెమలిపురం, పుట్టంగండి, ఘనిపల్లి, పెద్దగుమ్మడం, పెద్దగట్టు, పడమటి తండా, జి.భీమనపల్లి,మల్లాపురం,

24న చిలకమర్రి, పిఏపల్లి, బాలాజీనగర్, నక్కలపెంటతండా, నంబాపురం, ఘనపురం, వద్దిపట్ల

వేములపల్లి మండలంలో..

21న ఆమనగల్లు, బుగ్గబావిగూడెం, రావులపెంట

22న వేములపల్లి, లక్ష్మీదేవిగూడెం, మంగాపురం గ్రామాలు

23న అన్నపరెడ్డిగూడెం, శెట్టిపాలెం, సల్కునూరు గ్రామాలు

24న తిమ్మారెడ్డిగూడెం,మొల్కపట్నం, కామేపల్లి గ్రామాలు

గుర్రంపోడు మండలంలో..

21న మక్కపల్లి, పాల్వాయి, వెన్నెలాపురం, చేపూరు, కొయగూరవానిబావి, పోచంపల్లి, జూనూతుల, ఆమలూరు, బొల్లారం

22న చింతగూడెం, తేనెపల్లి, యల్లమోనిగూడెం, కాల్వపల్లి, తేరాటిగూడెం, పిట్టలగూడెం, గాశిరాంతండా, ఉట్లపల్లి, కొప్పోలు, బుడ్డారెడ్డిగూడెం,

23న ముల్కలపల్లి, జిన్నాయిచింత, పాశంవారిగూడెం, మొసంగి, మొనిన్‌ఖాన్‌గూడెం, వెంకటాపురం(ఎస్), తేనెపల్లితండా, గుర్రంపోడు, నడికుడ,

24న చామలోనిబావి, కాచారం, వట్టికోడు, పల్లెపాడు, లక్ష్మీదేవిగూడెం, సుల్తాన్‌పూర్, తానేదారుపల్లి, చామలేడు, కోతులాపురం

కళాకారులను ప్రోత్సహించాలి

మిర్యాలగూడ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించాలని వేంకటేశ్వరాలయ కమిటీ ప్రధా న కార్యదర్శి రంగయ్య అన్నారు. పట్టణ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్, ఏఎన్‌ఆర్, శోభన్‌బాబు స్వరాభిషేక ముగింపులో కళాకారులు అభినం దించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల గాయకులను ఆహ్వానించడం గొప్ప విషయమన్నారు. అనంతరం కళాకారులను అభినందించారు. కార్యక్ర మంలో రాజేందర్, రఘురామయ్య, నరసింహాచారి, మురళీధర్, రంగారావు పాల్గొన్నారు.

సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పోకల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాంచందర్ నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ, ఉపాధ్యక్షుడిగా జె. రాజు, వైష్ణవీదేవి, కోశాధికారి రమేష్, సంయుక్త కార్యదర్శి జోగయ్య, సైదులు ఎన్నికైనట్లు ప్రకటించారు.

నివాస స్థలాలకూ ‘రైతు బంధు’

● రైతు భరోసా సర్వేలో వెలుగు చూస్తున్న అవకతవకలు ● ఉమ్మడి పీఏపల్లి మండలంలో 240 ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూమి గుర్తింపు



అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి,జనవరి20(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్న ఉద్దే శంతో గత ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకం కొందరు అనర్హులకు కాసుల వర్షం కురిపించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడానికి సాగుకు యోగ్యం కాని భూములను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించడానికి సర్వే చేపట్టింది. ఈ క్రమంలో పెద్ద అడిశర్లపల్లి, గుడిపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో చేపట్టిన రైతు భరోసా సర్వేల్లో అనేక అవక తవకలు వెలుగు చూస్తున్నాయి. అయితే ఉమ్మడి పీఏపల్లి మండలంలోని హైవే పక్కన ఉన్న అంగడిపేట ఎక్స్‌రోడ్డు, అక్కంపల్లి, ఘనపురం, రోళ్లకల్లు, చిలకమర్రి ప్రాంతాల్లో ఆదివారం వరకు నిర్వహించిన సర్వేల్లో కొన్ని అక్రమాలు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు 240 ఎక రాల్లో వెంచర్లు ఆ భూముల్లో ఇంటి నిర్మాణాలు, భవనాల నిర్మాణం జరిగినట్లు సర్వేలో తేలింది. ఈ నిర్మాణాలు జరిగి కూడ దాదాపు పదేళ్లు దాటి పోయింది. అయితే అసలు విషయం ఏమిటంటే ఇలాంటి భూములకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం వరకు రైతుబంధు పథకానికి సంబంధించిన నగదు ఖాతాల్లో జమ అయింది. ప్రస్తుతం నిర్వహించిన సర్వేల్లో ఇలాం టి భూముల వివరాలు సేకరించిన అధికారులు ఆయా భూముల యజమానులకు సమాచారం అందించడమే కాకుండా ఇకపై మీకు రైతు భరోసా నగదు జమ కాకుండా తొలగించి సమా చారం అందిస్తున్నారు. కొంద రు స్వచ్ఛందంగా తొలగించాలని చెబుతున్నారని, మరికొందరు అధికారుల హెచ్చరికలతో తొలగించాలని అని పేర్కొంటున్నట్లు సర్వే అధికారులు తెలిపారు. ఇలా కేవలం ఉమ్మడి పీఏపల్లి మండలంలోనే కాకుండా జాతీయ రహదారిపైన ఉన్న ఇతర మండలాల్లో రైతుబంధు పథక నిధులు నివాస ప్రాంత భూములకు చేరినట్లు తెలుస్తుంది.

గ్రామ సభలు నిర్వహించి ఆ తర్వాత తొలగిస్తాం

ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి వ్యవసాయేతర భూములు, వెంచర్లను గ్రామసభలో చదివి వినిపిస్తాము. గ్రామ సభల ఆమోదం ప్రకారం అట్టి భూములను, నాలా కన్వర్షన్ లేని వెంచర్స్‌ను తొలగిస్తాం. రైతు భరోసాను అపివేస్తాము. అందరూ సహకరించాలి.

- రమణారెడ్డి ,ఆర్డీవో, దేవరకొండ

కొనసాగుతున్న సర్వే

చింతపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిరాంనగర్, తక్కళ్లపల్లి, చాకిలిశేరుపల్లి, రోటిగడ్డతండాల్లో మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సోమవారం భూములను క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఏవో శ్రావణకుమారి మాట్లాడుతూ రైతు భరోసా పథకాన్ని పారదర్శకంగా అందించడానికి సర్వే చేస్తున్నామని ఆమె తెలిపారు.

మహిళ నేత్రదానం



కొండమల్లేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన దుండిగళ్ల చంద్రకళ హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో ఆదివారం మృతి చెందింది. ఆ కోరిక మేరకు తన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యుల అంగీకారం తెలుపడంతో ఆమె కళ్లు దానం చేశారు. చంద్రకళ మరికొందరికీ ఆదర్శంగా నిలిచిందని పలువురు పేర్కొంటున్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



చింతపల్లి: సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింపతల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామా ల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండలం గొడుకొండ్ల (వెంకటేశ్వరనగర్)లో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయ న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. అర్హులందరికీ పథకాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

మదనాపురం ఆలయ కార్యవర్గం

మండలంలోని మదనాపురంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కార్యవర్గం సోమవారం ప్రమాణస్వీకారం చేసింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా డేరంగుల మహేష్, డైరెక్టర్లుగా మురుకుంట్ల శ్రీనివాస్, ఆడేపు కల్పన, బాలగోని వెంకటయ్య, డేరంగుల కుమార్, పి.రాజు, మురుకుంట్ల రవి, సీతరామును నియమించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.

అనంతరం వారు ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిశారు. వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సుజాత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలూ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ జంగిటి నరసింహ, మాజీ వైస్ ఎంపీపీ యాదయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, డీఈఈ జీవన్‌సింగ్, ఏఈ, కార్యదర్శి పద్మ, గడ్డం పురుషోత్తం రెడ్డి, గుండ్లపల్లి నర్సిరెడ్డి, వాంకుడోత్ రవినాయక్, హరినాయక్, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

త్రిపురారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ విమర్శించారు. మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్కారు కడుపున పెట్టుకొని కాపాడుకున్న రైతులను కాంగ్రెస్ మళ్లీ రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఏదో మార్పు తెస్తుందని నమ్మి ఓటేసిన పాపానికి ప్రజలను నట్టేట ముంచిందని పేర్కొన్నారు. రుణమాఫీ, పెట్టుబడి సాయం, ధాన్యానికి బోనస్ ఇలా అన్నింటా ప్రభుత్వం కోతలు పెడుతుందని, సాగునీళ్లివ్వక, కరెంటు సరఫరా లేక పాత రోజులను మళ్లీ తేవడంతో కడుపు మండిన అన్నదాతలు రోజుకో చోట తమ ఆవేదన ఆగ్రహాన్ని నిరసనల రూపంలో వెలిబుచ్చుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు పెడతాననడం సిగ్గులేని చర్య అని, ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులు చెత్తబుట్టల పాలయ్యాయని ఆరోపించారు. అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు వచ్చేదాకా బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పామోజు వెంకటాచారి, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకన్న యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ కామెర్ల జానయ్య, రైతుబంధు సమితి మాజీ జిల్లా డైరెక్టర్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, జంగిలి శ్రీనివాస్ యాదవ్, బైరం కృష్ణ, కాంతారావు, ఎస్‌కె దస్తగిరి, చింతకాయల యాదయ్య, సయ్యద్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి పరామర్శ

హాలియా, (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ కూరాకుల అంతయ్య యాదవ్ ఇటీవల ప్రమాదశాత్తు గాయాలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సోమవారం నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని మనో ధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జటావత్ రవి నాయక్, రమావత్ శ్రీకర్‌నాయక్, రవినాయక్, రవియాదవ్, జటావత్ రాజశేఖర్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 75 వేల దరఖాస్తులు

మిర్యాలగూడ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు తెలిపారు. కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అధికారులతో కలిసి ఆయన మాట్లాడారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 75 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని సోమవారం (నేటి) నుంచి నిర్వహించనున్న గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోలేక పోయామనే ఆందోళన అవసరం లేదని ఇది నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. రేషన్ కార్డులకు సమగ్ర కుటుంబ సర్వేలో 10,300 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం కింద మిర్యాలగూడ మండల పరిధిలో 600 ఎకరాలు సాగు యోగ్యంకాని భూమిగా తేలిందన్నారు. ఆత్మీయ భరోసాలో భూమి లేని నిరుపేదలు జాబ్ కార్డు కలిగి గత ఏడాది 20 రోజుల పాటు ఉపాధి పనులు చేసిన కుటుంబానికి ఏడాది రూ. 12 వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లకు 20,725 మంది దరఖాస్తు చేసుకోగా 1,996 మందికి ఇళ్ల స్థలాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. 15, 927 మందికి హైజ్‌సైట్స్ లేవని, 2,700 మంది కి ఇళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ తెలిపారు. నేటి నుంచి రోజుకు 12 వార్డుల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ రాందాసు, ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ పుష్పలత, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి : బీజేపీ



డిండి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

డిండి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ, గ్రామాన కాంగ్రెస్ నాయకులను నిలదీస్తామని హెచ్చరించారు. పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కౌలు రైతులకు రూ.12వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏటికృష్ణ, మాధవరం నర్సింహరావు, రాధిక, బరపటి కొండల్, భిక్షపతి, రామకృష్ణ, సాయికుమార్, శ్రీకాంత్, గాయాల రాఘవేందర్, విజయ్, గెల్వయ్య, శ్రీను, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తాటిచెట్టు ఎక్కే యంత్రాలపై అవగాహన

దేవరకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు ఎక్కే యంత్రాలపై సోమవారం దేవరకొండ మండలం తాటికోల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత సమగ్ర తాటిచెట్ల ప్రోగ్రాం కోఆర్డీనేటర్ డాక్టర్ అగస్టీన్, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ రాజగౌడ్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం తాటిచెట్టు ఎక్కే యంత్రాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో అందజేస్తుందని వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో యుగేందర్, గౌడ సొసైటీ అధ్యక్షుడు జూలూరి శ్రీనివాస్‌గౌడ్, జూలూరి గిరిప్రసాద్‌గౌడ్, పబ్బు వెంకట్‌గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్యదర్శి అక్రమాలపై విచారణ చేపట్టాలి

మిర్యాలగూడ రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవంతీపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి అవినీతి, అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ జారీ చేసే సర్టిఫికెట్ల విషయంలోనూ, ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా గ్రామపంచాయతీ రికార్డుల్లో ఎక్కిస్తున్నారని వివరించారు. అక్రమ లేఅవుట్లకు అనుమతులుఇస్తున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే దుర్భాషలాడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు సురేష్ ఉన్నారు.

ఆలయ భూములను కాపాడాలి

గుర్రంపోడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో గల సీతారామచంద్ర, ఆంజనేయ స్వామి ఆలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని రక్షించాలని దేవాలయ కమిటీ చైర్మన్ అయితగోని పరమేష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ భూములను కొంత మంది కబ్జా చేస్తున్నారని ఆ కబ్జాలను గుర్తించి అట్టి భూములకు సర్వే చేయించి హద్దురాళ్లు పాతించాలని కోరారు. ఆయన వెంట నారాయణ, సతీష్‌చారి, వెంకటేష్ ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి

కొండమల్లేపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ పిలుపునిచ్చారు. స్థానిక పాల శీతలీకరణ కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా ఎగొట్టిన కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించతలపెట్టిన మహా ధర్నాకు కావాలనే అనుమతి నిరాకరించారన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ విఫలమైందని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని శ్రావణ్‌రెడ్డి, జబ్బు యాదయ్య, గుండెబోయిన లింగంయాదవ్, రమావత్ శ్రీనునాయక్, నేనావత్ శంకర్‌నాయక్, యాదయ్య పాల్గొన్నారు.

ఎడమ కాల్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



జానారెడ్డిని సన్మానిస్తున్న సోమన్న, నాయకులు

హాలియా, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమ కాల్వ సిబ్బందికి ఐదే ళ్లుగా టీఏలు, యూనిఫామ్ రావడం లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న ఆధ్వర్యంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డికి సోమవారం వినతి పత్రం అంద జేశారు. ఈ విషయంపై మాజీ మంత్రి జానారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. అనంతరం ఐఎన్‌టీయూసీ నాయకులు జానారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎడమ కాల్వ బ్రాంచ్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు పెరిక వెంకటేశ్వర్లు, కార్యదర్శి గోపిశెట్టి ఆంజనేయులు, షేక్ అన్వరుద్దీన్ పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలను అందించాలి

గుర్రంపోడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చూడాలని మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్య దర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంపీడీవో మంజుల, డిప్యూటీ తహసీల్దార్ ఫరీద్, ఎంపీవో పద్మ, ఆర్ఐసీఎస్ రావుల సైదులుగౌడ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సాగుకు యోగ్యం కాని భూముల సర్వే పూర్తి

● జంగాల కృష్ణయ్య, తహసీల్దార్



నిడమనూరు మండలంలో సాగుకు యోగ్యం కాని భూముల సర్వే పూర్తయిందని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో సర్వేను పూర్తి చేశామన్నారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల గురించి ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడారు.

(నిడమనూరు, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: సాగుకు యోగ్యం కాని భూముల సర్వే పూర్తయిందా?

తహసీల్దార్: మండలంలో సర్వే పూర్తయింది. సర్వేను పారదర్శకంగా పూర్తి చేశాం. నేటి నుంచి నాలుగు రోజులపాటు గ్రామసభలు నిర్వహించనున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో సాగుకు నోచని భూమి ఎన్ని ఎకరాలు ఉన్నట్లుగా గుర్తించారు?

తహసీల్దార్: 400 పైచిలుకు ఎకరాల్లో సాగుచేయనట్లుగా సర్వేలో తేలింది

ఆంధ్రజ్యోతి: కొత్త రేషన్‌కార్డుల మంజూరు గురించి చెప్పండి?

తహసీల్దార్: మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం 993 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులందరికీ కార్డులు అందజేస్తాం. అలాగే రేషన్‌కార్డుల్లో అదనంగా పేర్ల చేర్పించడం కోసం 2,495 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఈనెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల గురించి?

తహసీల్దార్: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయనుంది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నారా?

తహసీల్దార్: తమ దృష్టికి వస్తున్న రెవెన్యూ సమస్యలు సాధ్యమైనంతవరకు సత్వరమే పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డిండి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్కుపల్లి, ఎర్రారం సబ్‌స్టేషన్ల పరిధి లోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చెర్కుపల్లి, బొలనపల్లి, నిజాంనగర్, టి.గౌరారం, ఖానాపూర్, నెమలి పూర్, ఎర్రారం, గోనబోయినపల్లి, కామేపల్లి గ్రామాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొ న్నారు. 120/33 లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున 9 గ్రామాలు, ఆవాసా లకు సరఫరా నిలిపివేయనున్నట్లు వివ రించారు.

ఫిబ్రవరి 11న సుంకిశాల ముత్యాలమ్మ తల్లి జాతర

పెద్దవూర, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగూడెం తండా వద్ద వెలిసిన సుంకిశాల ముత్యాలమ్మ జాతర ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి సమక్షంలో పొట్టవానితండా గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మతండా, యేనేమిదితండా, తుమ్మచెట్టు గ్రామాల గిరిజన పెద్దలు, ఆలయ కమిటీ సమావేశమై జాతర ఏర్పాట్లపై సమీక్షించినట్లు తెలిపారు.

శేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి, దివంగత బొడ్డుపల్లి శేఖర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమాల ఆంజనేయులు, సీపీఐ దేవరకొండ మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శేఖర్ 23వ వర్ధంతిని పురస్కరించుకొని దేవరకొండలో సోమవారం ఆయన స్మారక స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సురిగి వినయ్, పల్లా రంగారెడ్డి, శంషొద్దీన్, జ్యోతి, స్వాతి, సిద్దార్థ, హరీష్, చరణ్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

దేవరకొండ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం 1981-82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ ఒక వేదికపై కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు రూ.55వేలు విలువజేసే కంప్యూటర్‌ను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రెబకాను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పూర్వ విద్యార్థులు సంధ్య, రాధిక, సుహాసిని, అలివేలు, నీరజ, మాధవి పాల్గొన్నారు.